


ఐదు సంతకాలు..

హర్షాతిరేకాలు!

- పింఛన్‌దార్లకు ఇక నెలకు రూ.4 వేలు
- దివ్యాంగులకు నెలకు ఇక రూ.6 వేలు
- ఏప్రిల్ నుంచి అమలు.. జూలై నుంచి పంపిణీ
- జిల్లాలో రూ.92 కోట్లకు చేరనున్న పింఛన్ల సొమ్ము
- పింఛనుదారులకు ఇక నెలానెలా సంతోషమే
- ఇప్పటివరకూ రూ.71కోట్లు పంపిణీ
- మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఆనందం
- త్వరలో అన్నాక్యాంటీన్లు ప్రారంభం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- నైపుణ్య గణనతో మరో కీలక నిర్ణయం
- నిరుద్యోగులకు ఈ గణనతో కొత్త ఆశలు



బాబు తొలి సంతకం

ఒకటి కాదు.. ఒకేరోజు ఏకంగా ఐదు సంతకాలు.. ఈ అయిదూ కీలక నిర్ణయాలే. ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నది ఇలాంటి క్షణాల కోసమే. ముఖ్యంగా పింఛనుదారులు, యువకులు వేయికళ్లతో వేచిచూస్తున్నది ఈ సంతకాల కోసమే. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పింఛను రూ.3 వేలు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారం చేపట్టాక జగన్ మాటమార్చారు. పెంచుకుంటూ పోతామని చెప్పానని, అందుకే ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ వచ్చి ఇచ్చిన మాట తప్పారు. ఇప్పుడు చంద్రబాబు రూ.4 వేల పింఛను, దివ్యాంగులకు రూ.6 వేల పింఛను ఇస్తానని హామీ ఇచ్చి తొలి రోజునే సంతకం చేశారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఏళ్ల తరబడి చూస్తున్న నిరుద్యోగులకు సంతోషం కలిగించేలా తొలి సంతకం డీఎస్సీపైనే పెట్టారు. అలాగే అన్నాక్యాంటీన్లు ప్రారంభించడంతోపాటు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తూ మరో రెండు సంతకాలు.. నైపుణ్య గణన చేసేందుకు మరో కీలక నిర్ణయంపైనా మరో సంతకం చేశారు. ఇవన్నీ కీలక నిర్ణయాలే కావడంతో ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు తొలుత ఐదు హామీలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయడంతో అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పింఛనుదార్లకు నెలకు రూ.4 వేల పింఛను, అన్నక్యాంటీన్లను తెరవడం, నైపుణ్య గణన వంటి ఐదు హామీల మీద ఆయన గురువారం వెలగపూడి సచివాలయంలో బాధ్యతలు తీసుకున్న వెంటనే సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ఆయా నిర్ణయాలకు సంబంధించి గణాంకాలను సిద్ధంచేస్తున్నారు. అలాగే పింఛన్లను నెలకు రూ.4 వేలు చేయడం, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచడం వల్ల తూర్పుగోదావరి జిల్లాలో సుమారు నెలకు రూ.20 కోట్లు అదనంగా అవసరమవుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకూ జిల్లాలో మొత్తం 18 రకాల పింఛన్ లబ్ధిదార్లు 2,42,300 మంది ఉన్నారు. వారికి నెలకు రూ.71,92,21,700 పంపిణీ అవుతోంది. కానీ ఇంతవరకూ రూ.3 వేలు పొందేవారికి రూ.4 వేలు, ఇంతవరకూ నెలకు రూ.3 వేలు పొందుతున్న దివ్యాంగులకు ఇక నెలకు రూ.6వేలు చేయడం వల్ల జిల్లాలో ఇక నెలకు అదనంగా మరో రూ.20 కోట్లు భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ పెంపుతో జిల్లాలోని వేలాదిమంది పింఛన్‌దార్లు చాలా ఆనందపడుతున్నారు. వృద్ధులు, వితంతువు, దివ్యాంగులు వంటి పింఛన్‌దార్లకు ఇది చాలా ఉపయోగపడుతుందని, బతుకుకు భరోసా అని చెబుతున్నారు. ఇక ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందపడుతున్నారు. వైసీపీ తీసుకొచ్చిన ఈ చట్టం వల్ల తమ భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని.. అధికారం, నోరు, డబ్బు ఉన్నవారిదే పెత్తనం అవుతుందని ప్రజలు తీవ్రంగా భయపడిపోయారు. ఎవరైనా తమ భూమిని కబ్జా చేస్తే కోర్టు వెళ్లే అధికారం కూడా లేకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. కానీ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండో సంతకం ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు ఫైల్‌పై సంతకం పెట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించే ఫైళ్ల మీద కూడా ఆయన సంతకం పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల కోసం రూ. 5కే అన్నం పెట్టే అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆసుపత్రుల వద్ద, వివిధ కూడళ్లలోనూ ఈ క్యాంటీన్లను ఏర్పాటుచేసి భోజనం పెట్టేవారు. కానీ 2019లో జగన్ సీఎం కాగానే వీటిని కూడా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్యాంటీన్లు ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి కూడా వచ్చేవారికి, కాలేజీలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు, సిటీలో కూలీనాలీ చేసుకునే పేదలకు, ఇతర ప్రాంతాల నుంచి పనుల మీద వచ్చేవారికి కూడా ఇది చాలా ఉపయోగపడేది. కేవలం ఐదు రూపాయలకే ఆకలి తీర్చేది. వాటిని తిరిగి తెరిచే నిర్ణయం కూడా చంద్రబాబు తీసుకోవడంతో పేద వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొంతగా చంద్రబాబు నైపుణ్య గణన అనే కార్యక్రమాన్ని ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంట్లో ఎవరికి ఏ రంగంలో నైపుణ్యం ఉందో తెలుసుకునే క్రమంలో ప్రతీ ఇంటా ఈ సర్వే చేస్తారు. ఎవరికి ఏ నైపుణ్యం ఉందో వివరాలు సేకరించి తదనుగుణంగా ఆయా వర్గాలవారికి మేలు చేసే నిర్ణయాలు అమలుచేయనున్నారు. ఈ పథకం కూడా అన్ని వర్గాలకు మేలు చేసేది కావడంతో కీలకంగా మారింది.

పింఛన్‌దార్ల వివరాలివీ...

జిల్లాలో 18 రకాల పింఛన్‌దార్లు ఉన్నారు. అభయహస్తం కింద జిల్లాలో 5734 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.500 ఇస్తారు. అమరావతి రాజధానికి ల్యాండ్స్ ఇచ్చినవారు ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున పింఛన్ ఇస్తున్నారు. సీకేడీయూ (డయాలిసిస్) ప్రభుత్వ వైద్యం పొందేవారు 182 మంది, ప్రైవేట్ వైద్యం పొందేవారు 219మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.10 వేల వంతున పింఛన్ అందుతోంది. డప్పు కళాకారులు జిల్లాలో 745 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. దివ్యాంగులు జిల్లాలో 32,962 మంది ఉన్నారు. ఇప్పటివరకూ వీరికి నెలకు రూ.3 వేలు ఇస్తుంటే కూటమి ప్రభుత్వం రూ.6 వేలు ఇవ్వనుంది. డీఎంహెచ్ ద్వారా పింఛన్ అర్హత ఉన్నవారు 1795 మంది ఉన్నారు. వారికి రోగాన్ని బట్టి రూ.3 వేలు, రూ.5 వేలు, రూ.10వేలు ఇస్తున్నారు. మత్స్యకార పింఛన్ కూడా ఉంది. జిల్లాలో 1917 మంది మత్స్యకార పింఛన్‌దార్లు ఉన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నెలకు రూ.4 వేలు వస్తుంది. వృద్ధాప్య పింఛన్లు పొందేవారు జిల్లాలో 119922 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.3 వేలు మాత్రమే వస్తుంది. ఇక నుంచి నెలకు రూ.4 వేలు ఇస్తారు. కళాకారుల పింఛన్ కింద జిల్లాలో 154 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.3 వేలు వస్తుంది. ఇక నెలకు రూ.4 వేలు ఇస్తారు. సైనిక్ వెల్ఫేర్ కింద 17మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.5 వేలు ఇస్తున్నారు. ఒంటరి మహిళ పింఛన్ పొందేవారు 9132 మంది ఉన్నారు. ఇప్పటివరకూ వీరికి రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నాలుగు వేలు ఇస్తారు. గీత కార్మికులు 2466 మంది ఉండగా వీరికి కూడా నెలకు రూ.4 వేలు ఇస్తారు. ట్రాన్స్‌జెండర్లు 60మంది ఉన్నారు. వీరికి కూడా నెలకు 3 వేలు ఇస్తున్నారు. ఇక నాలుగు వేలు ఇస్తారు. చేనేత కార్మికులు 1324మంది ఉన్నారు. వీరికి కూడా 3 వేలు ఇస్తున్నారు. ఇక 4 వేలు ఇస్తారు. వితంతు పింఛన్లు పొందేవారు 64,813 మంది. వీరికీ రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నెలకు రూ.4 వేలు ఇస్తారు. చెప్పులు కుట్టేవారు 855 మంది వరకు ఉన్నారు. వారికీ నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నెలకు రూ.4 వేలు ఇస్తారు. మొత్తం జిల్లాలో 2,42,300 మంది పింఛనుదార్లు ఉండగా, వారికోసం నెలకు సుమారు రూ.71 కోట్ల, 92 లక్షల 17 వేలు లబ్ధిపొందుతున్నారు. ఇది మరో రూ.20 కోట్లు పెరిగి, ఇక నెలకు రూ. 92 కోట్ల వరకూ అవసరం అవుతుంది. ఈ పథకం ఏప్రిల్ నుంచి పంపిణీ చేస్తుండడం వల్ల మూడు నెలలకు మరింత అదనంగా నిధులు అవసరం.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేసిన చంద్రబాబుకు ధన్యవాదాలు

- ముప్పాళ్ల సుబ్బారావు



వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ప్రముఖ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. ప్రజల ఆస్తుల భద్రతకు ప్రమాదకరంగా పరిణమించిన ఆ చట్టాన్ని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. జగన్ సర్కార్ అరాచక పాలనకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఒక నిదర్శనమని ముప్పాళ్ల మండిపడ్డారు.

రైతులు ఊపిరి పీల్చుకున్నారు



రైతులకు చెందిన భూములపై హక్కు కోల్పోయే విధంగా రూపొందించిన లాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబునాయుడు రద్దు చేయడంతో రైతులు అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వం ఈ యాక్ట్‌ను తీసుకువచ్చింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. రైతుల పాస్‌బుక్‌లపై సీఎం ఫొటో ఉండేది. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు. రైతుల బాగోగులు ఆయనకు తెలుసు. అందుకే లాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశారు. - పిల్లా శ్రీనివాస్, కడియపులంక నర్సరీ రైతు

పేదల ఆకలి తీర్చే దేవుడు..



గత ఐదేళ్లుగా చాలా ఇబ్బందులుపడ్డాం. రూ.5కు పట్టెడన్నం పెట్టిన చంద్రబాబు అధికారంలో లేక అన్నా క్యాంటీన్లు నిలుపుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్నా క్యాంటీన్లు మూసివేయడంతో చాలామంది ఆకలి బాధలు పడ్డారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా అన్నాక్యాంటీన్లు తెరిపించడం చాలా ఆనందాన్ని ఇస్తోంది. ఎంతోమంది ఆకలి బాధలు తీరనున్నాయి.

- షేక్ మస్తానీ, రాజమహేంద్రవరం

థ్యాంక్యూ సీఎం సార్..



రాష్ట్రంలో బీఈడీ పూర్తి చేసి ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నవారు లక్షలాది మంది ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు మాట ఇచ్చారు. నేను భీమవరంలో పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం కూడా ఇచ్చా. మొత్తానికి తొలి సంతకం చంద్రబాబు మెగా డీఎస్సీపై చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను ఎంఏ బీఈడీ చేశా. థ్యాంక్యూ సీఎం సార్.

- సన్నంగి సత్యవతి, రాజమహేంద్రవరం

సంతోషంగా ఉంది



ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో టెట్ క్వాలిఫై అయ్యి 8 ఏళ్ల గడుస్తోంది. జగన్ జాబ్ క్యాలెండర్ తీస్తాడని 5 ఏళ్లు ఎదురుచూశాం. ఇటు ఉద్యోగం రాక.. అటు తల్లిదండ్రుల మాట కాదనలేక వివాహం చేసుకున్నా. జగన్ మోసంతో చేశారు. బాబు డీఎస్సీపై తొలి సంతకం సంతోషాన్నిచ్చింది.


- పావని, గోపాలపురం

- రాజమహేంద్రవరం సిటీ, కడియం, గోపాలపురం

'తూర్పు'కిక మహర్దశ

- అభివృద్ధిలో బంధుత్వాలు కలిసొచ్చే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో రెండు ప్రధాన పార్టీల రాష్ట్రాధ్యక్షులు
- ఇటు పురందేశ్వరి, అటు పవన్‌కల్యాణ్‌పై ఎన్నెన్నో ఆశలు
- ఉమ్మడి ప్రభుత్వానికి బీజం పడిందీ.. కీలక మలుపులూ ఇక్కడే
- 2027 పుష్కరాలూ చంద్రబాబు హయాంలోనే..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)



దెబ్బతిన్న సింహం శ్వాస కూడా గర్జనకంటే భయంకరంగా ఉంటుందంటారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా 'చంద్రబాబు అనే నేను' అనే పదంలో అదే ధ్వనించింది. ఆ గర్జనతో రాష్ట్రానికి పట్టిన చీకటి పటాపంచలైపోయింది. రాష్ట్రం మళ్లీ గాడిలో పడింది. అయితే తమ ప్రాంతానికి మహర్దశ పట్టనుందనే ఆనందంలో గోదావరి తీరవాసులు సంబరపడుతున్నారు. దశ తిరగనుందని భావిస్తున్నారు. ముందు నుంచీ టీడీపీని తూర్పువాసులు ఇంట్లో కుటుంబ సభ్యుడి మాదిరిగా ఆదరించారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ అయితే తెలుగుదేశానికి కంచుకోట అని చెప్పక తప్పదు. గత ఎన్నికల వైసీపీ సుడిగాలిలో కూడా ఈ రెండు చోట్లా టీడీపీని కదిలించలేకపోయారు. ఇప్పుడు అంతకుమించి అక్కున చేర్చుకున్నారు. జనం ఐదేళ్లుగా ఎదురు చూసిన 'చంద్రోదయానికి అంకురార్పణ మన 'తూర్పు'లోనే జరగడం విశేషం. ఇక తూర్పుగోదావరిలో పదవులు అలంకరించిన వారి బంధుత్వాలు జిల్లాకు కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో, కేంద్రంలో కీలకంగా మారిన నేతలకు జిల్లాలోని ప్రజాప్రతినిధులతో దగ్గరి బంధుత్వాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ముఖ్యమంత్రి చంద్రబాబు మరిది అవుతారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి పురందేశ్వరి స్వయానా అక్క. అలాగే రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు బావమరిది, ఆయన సతీమణి భవానీ తమ్ముడు కింజారపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర ప్రభుత్వ కేబినెట్‌లో పౌర విమానయాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. భవానీ చిన్నాన్న కింజారపు అచ్చెన్నాయుడు రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ బంధుత్వాలు జిల్లాకు ముఖ్యంగా రాజమహేంద్రవరం నగర రూపు రేఖలు మార్చడంలో ఎంతగానో సహాయపడతాయనే చర్చ నడుస్తోంది.

● అనుభవం కలిసొస్తే...

ఎంపీ విజేత పురందేశ్వరికి అటు రాజకీయం ఇటు పరిపాలనాపరంగా అపార అనుభవం ఉంది. ఎన్టీఆర్ కూతురిగా మరింత అభిమానం ప్రజల్లో ఉంది. ఆమెకు కేంద్ర ప్రభుత్వంలో చెప్పుకోదగిన పరిచయాలు ఉన్నాయి. గతంలో కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఢిల్లీలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలతోపాటు ప్రధాని మోదీ దగ్గరకు కూడా సునాయాసంగా వెళ్లగల పలుకుబడి ఉంది. ఆమె గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఇటు జిల్లా యువతకు, అభివృద్ధికి పనిచేస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కేంద్రం నుంచి భారీ ప్రాజెక్టులు వస్తే ఐదేళ్ల నుంచీ ఉపాధి లేక ఎదురు చూస్తున్న యువతకు ఊతమవుతుందని ఆశిస్తున్నారు. అలాగే అభివృద్ధి విషయంలోనూ ముఖ్యంగా రాజమహేంద్రవరాన్ని పట్టిపీడిస్తున్న ముంపు నీరు, కలుషిత తాగునీరు, డెడికేటెడ్ చానెల్, పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి, గోదావరిపై రైలు మరో రైలు వంతెన వంటి వాటికి కేంద్ర నిధులతో పరిష్కారం దొరకుతుందని ఆశిస్తున్నారు. నిడదవోలు శాసనసభ నుంచి గెలిచి మంత్రి పీఠం దక్కించుకున్న కందుల దుర్గేశ్‌కి కూడా పరిపాలనా అనుభవంతోపాటు జిల్లాపై పూర్తిస్థాయిలో పట్టుంది. సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు రాజకీయంగా కాస్త అనుభవం ఉన్నా పరిపాలనాపరంగా పట్టు సాధించాల్సి ఉంది. ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు, చినమామ కింజారపు అచ్చెన్నాయుడు, బావమరిది రామ్మోహన్‌నాయుడుకు ఉన్న రాజకీయ, పరిపాలనా అనుభవం అదిరెడ్డి వాసుకు కలిసొచ్చే అంశమే. ఇవన్నీ జిల్లా అభివృద్ధిని పరుగు పెట్టిస్తాయని గోదావరోళ్లు ఎదురు చూస్తున్నారు.

రెండు పార్టీల రాష్ట్రాధ్యక్షులు

ఉమ్మడి తూర్పుగోదావరికి మరొక ప్రాముఖ్యత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని రెండు చోట్ల కీలకమైన పార్టీల అధ్యక్షులు బరిలో దిగి అదరగొట్టారు. పిఠాపురం శాసనసభ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత కొణిదల పవన్‌కల్యాణ్ ఘన విజయం సాధించారు. డిప్యూటీ సీఎం హోదాను పవన్‌కల్యాణ్‌కి ఇచ్చి కూటమి గౌరవించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన ఇప్పుడు పిఠాపురం నియోజకవర్గ రూపురేఖలు మారుస్తారని ప్రజలు బలంగా ఆశిస్తున్నారు. పవన్ కూడా తనను ఆదరించిన నియోజకర్గానికి ఏదొక శాశ్వత మేలుచేయాలనే తపనతో ఉన్నట్టు చెబుతున్నారు. పవన్ డిప్యూటీ సీఎం కూడా కావడంతో ఉమ్మడి తూర్పునకు కూడా గట్టి మేలు జరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం ఎంపీ విజేత పురందేశ్వరి బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు. బీజేపీలో మంచి పలుకుబడి ఉంది. కీలకమైన పదవులు అలంకరించిన అనుభవం ఆమె సొంతం. బీజేపీతోపాటు కేంద్ర, రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో కూడా మంచి సఖ్యత ఉంది. పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు మేలు జరగడం ఖాయమని భావిస్తున్నారు.

2027 పుష్కరాలూ చంద్రన్న హయాంలోనే..

గత పుష్కరాలకు 2015లో చంద్రబాబు ఏకంగా 12 రోజులు ముఖ్యమంత్రి హోదాలో రాజమహేంద్రవరంలోనే బస చేశారు. కేబినెట్ సమావేశం సైతం ఇక్కడే నిర్వహించారు. గోదావరి ఘాట్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు ఇచ్చారు. దేశంలోనే పెద్దదైన కోటిలింగాల ఘాట్‌ను అప్పుడే నిర్మించారు. నగరమంతా అద్దంలా తీర్చిదిద్దారు. అప్పట్లో కొందరు అధికారుల అలసత్వం వల్ల తొలిరోజున ఊహించని ఉప్పెన ఎదురైనా ఎక్కడా నిబ్బరం కోల్పోలేదు. వైసీపీ శవరాజకీయాలు చేసినా చలించలేదు. వందల మంది అధికారులు, సిబ్బంది ఉన్నా.. చంద్రన్నే స్వయంగా లోటుపాట్లను తెలుసుకొని తక్షణ పరిష్కారం చూపిస్తూ పుష్కరాలను ఔరా అనిపించారు. రైల్వేస్టేషను, బస్టాండ్, యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాలు తదితర చోట్లకు అర్ధరాత్రి వేళలో కూడా వెళ్లి సదుపాయాలపై ప్రజలను ఆరా తీసేవారు. బ్రిటిష్ వాళ్లు నాలిక తిరగక చారిత్రక నగరానికి మార్చేసిన పేరును మళ్లీ తీసుకొచ్చారు. రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మార్పుచేస్తూ ఇక్కడే చంద్రబాబు ఒక ప్రకటన చేశారు. మొత్తానికి ఓ మినీ కుంభమేళా మాదిరిగా ఆ ఏడాది పుష్కర ఉత్సవాలు జరిగాయి. ఈ పుష్కరాలకు జ్ఞాపకంగా దివాన్‌చెరువు సమీపంలో ఉన్న అటవీ వనాన్ని పుష్కర వనంగా తీర్చిదిద్ది నగర ప్రజలకు కానుకగా ఇచ్చారు. 2027లో మళ్లీ ఆయన చేతుల మీదుగానే పుష్కరాల క్రతువును గోదారమ్మ నిర్వహించుకోనుంది.



కువైట్ అగ్ని ప్రమాదంలో...

మనవాళ్లు ఇద్దరు మృతి

- ఒకరిది ఖండవల్లి..
- మరొకరిది అన్నవరప్పాడు
- నాలుగు రోజుల్లో ఇంటికి రావాల్సి ఉండగా ఘోరం
- పదేళ్ల నుంచి కువైట్‌లోనే ఉద్యోగం

- మెయిన్ 2లో



సీతంపేటలో పంపింగ్ స్కీమ్ ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్న మంత్రి దుర్గేష్

ప్రతి చేనుకు నీరు అందిస్తాం

సీతంపేటలో పంపింగ్ స్కీమ్ ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల : రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

- 8లో



బీసీ హాస్టల్ దుస్థితిపై పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్

బీసీ హాస్టల్ దుస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 13: రాజమహేంద్రవరంలో వై జంక్షన్ సమీపంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల దుస్థితిని సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికలకు ముందు చూసి చలించిపోయారు. ఇంత దారుణ పరిస్థితిలో బీసీ బాలలు ఇక్కడ చదువుకుంటున్నారా అని ఆవేదన చెందారు. ఎన్నికల తర్వాత టాయిలెట్స్ నిర్మిస్తామని, తగిన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కాగానే విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో ప్రభుత్వ శాంక్షన్ తీసుకుని నిర్మించేలోగా ఆలస్యమవుతుందని గ్రహించిన ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరంలోని కిమ్స్ హాస్పటల్ వారి సహకారంతో వై జక్షన్‌లో బాలుర వసతి గృహం, దేవీచౌక్‌లో బాలికల వసతి గృహంతో కలిపి మొత్తం 30 టాయిలెట్లు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వాటిని గురువారం ఆయన పరిశీలించారు. త్వరగా టాయిలెట్ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. వసతిగృహంలో టాయిలెట్ల సమస్యను వేగంగా పరిష్కరించిన ఎమ్మెల్యేకు విద్యార్థులు, బీసీ సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి.

బీసీ కార్డుతో గెలిచి బీసీలకు అన్యాయం

వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్డుతో మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎదిగిన వారెవ్వరు బీసీలకు న్యాయం చేయలేకపోయారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బీసీ వసతి గృహంలో టాయిలెట్ నిర్మాణాలను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లా ఇంచార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ ఆ స్థాయికి రావడానికి బీసీ కార్డే కారణమన్నారు. అటువంటి మంత్రి ఉండి కూడా బీసీ వసతి గృహాల్లో కనీస సదుపాయాలు లేవన్నారు. అంత దారుణంగా వాటిని గాలికి వదిలేశారని చెప్పారు. సమస్యను పరిశీలించిన తాను ఎమ్మెల్యే కాకముందే వెంటనే చర్యలు చేపట్టానని, బీసీ వసతి గృహాల్లో టాయిలెట్ సమస్యను పరిష్కరించామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిందని, అతి త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్, రాష్ట్ర నాయకులు యిన్నమూరి దీపు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్, మంత్రమూర్తి రాంబాబు, శెట్టి జగదీష్, బుడ్డిగ రవి, కాశి విశ్వనాథరాజు పాల్గొన్నారు.

అనపర్తి సావరంలో దాడికి రాజకీయాలకు సంబంధం లేదు: ఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అనపర్తి సావరంలో గురువారం రెండు వర్గాల మధ్య జరిగిన దాడికి రాజకీయాలకు ఎలాంటి సంబంధమూ లేదని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీ కార్యకర్తలు దారికాచి రాడ్లు, కర్రలతో దాడికి దిగారంటూ వదంతులు వ్యాప్తి చేస్తున్నారని చెప్పారు. గ్రామానికి చెందిన చల్లబోయిన కృష్ణ, చల్లబోయిన అప్పన్న బాబులకు అదే గ్రామంలోని మేడిశెట్టి అర్జున్ వాళ్ల కుటుంబాలకు పంచాయతీకి చెందిన ఖాళీ స్థలంలో ఉన్న కనకదుర్గమ్మ గుడి విషయంలో సుమారు 5 నెలల నుంచీ గొడవలు జరుగుతున్నాయని, వివాదం పెద్దల వరకూ వెళ్లినా పరిష్కారం కాలేదని ఎస్పీ వివరించారు. ఇరు వర్గాలూ గుడి విషయమై మళ్లీ గొడవపడగా గాయాలు అయ్యాయని, కేసులు నమోదు చేశామని వెల్లడించారు. ఇద్దరిని బైండోవర్ చేశామన్నారు. ఇది గుడికి సంబంధించిన వివాదమేగానీ, రాజకీయాలు సంబంధం లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేవిధంగా సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా అవాస్తవాలను వ్యాప్తిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్ - సిటీ

కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా

- 50 మంది వరకూ బాధితులు
- వివిధ ఆస్పత్రుల్లో చికిత్స
- గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు
- కలుషిత జలమే కారణమంటున్న గ్రామస్థులు


ఏవీ నగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

తొండంగి,జూన్ 14: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో డయేరియా ప్రబలింది. సుమారు 50 మంది వరకూ వ్యాధిబారిన పడి వాంతులు విరేచనాలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వ్యాధి ప్రబలేందుకు కలుషిత తాగునీరే కారణమని పలువురు గ్రామస్తులు పేర్కొంటుండగా మరికొందరు నిల్వ ఉన్న రొయ్యల కూర తినడం ,మామిడి తాండ్ర తినడం వలన వ్యాధి వచ్చిందంటున్నారు. వ్యాధిబారిన పడిన వారిలో మహిళలు, చిన్నపిల్లలు ఎక్కువగా ఉండడంతో ఆందోళనకు గురైన కొందరు నేరుగా కాకినాడ, కత్తిపూడి, అచ్చంపేట, సీతయ్యపేట తదితర గ్రామాల్లో గల ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం తరలి వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇంటింటా సర్వే జరిపి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. తీవ్రమైన అస్వస్థతతో ఉన్న ఐదుగురిని ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జనరల్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. కొందరికి డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సరిత, డాక్టర్ రవికుమార్ గ్రామంలో పర్యటించారు. పరిస్థితి అదుపులోనే ఉందని ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని తెలిపారు. నీటి వనరులు క్లోరినేషన్ చేయించాలని, తాగునీటి పైపుల లీకేజీ ఉంటే పరిశీలించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినాలని సూచించారు. గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉండగా ఓసీ, బీసీ కాలనీ వాసులు తాగునీరు తాగే ప్రాంతంలోనే వ్యాధి బాధితులు ఎక్కువగా ఉండడంతో నీటి కలుషితమే ప్రధాన కారణంగా ఉండవచ్చని అంటున్నారు,


గ్రామంలో పర్యటిస్తున్న వైద్య శాఖ ఉన్నతాధికారులు

20వ తేదీ తర్వాత పిఠాపురంలో పర్యటిస్తా: పవన్‌కల్యాణ్

పిఠాపురం, జూన్ 13: శాసనసభ సమావేశాలు, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుస్తానని రాష్ట్ర మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ నెల 20వ తేదీ తర్వాత పిఠాపురంలో తన పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మీడియాకు గురువారం మంగళగిరి నుంచి వివరాలు వెల్లడించారు. నియోజకవర్గంలో కార్యకర్తలను కలిసిన అనంతరం దశలవారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అన్ని వైపుల నుంచి శుభాకాంక్షలు, అభినందనలు అందుతూనే ఉన్నాయని చెప్పారు. ప్రజాజీవితంలో ఉన్న నాయకులు, మేధావులు, నిపుణులు, సినీరంగ ప్రముఖులు, యువత, రైతులు, ఉద్యోగవర్గాలు, మహిళలు అభినందనలు అందిస్తున్నారని చెప్పారు. జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు ఆనందంతో వేడుకలు చేసుకున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనను నేరుగా కలిసి అభినందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారని చెప్పారు. త్వరలో వారందరిని జిల్లాల వారీగా కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నానని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తానని తెలిపారు. అభినందనలు తెలియజేయడానికి వచ్చే వారు పూలబొకేలు, శాలువాలు తీసుకురావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



వాడపల్లి హుండీల ఆదాయం లెక్కింపు

ఆత్రేయపురం, జూన్ 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 28 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.77,65,489, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.19,32,588... మొత్తం రూ.96,98,077 ఆదాయం లభించింది. 33 గ్రాముల బంగారం, 580 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ లభించాయి. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,53,803 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

గోపాలపురం. జూన్ 13: గోపాలపురం మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారులో అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి మణికంఠ చౌదరి(అయ్యప్ప) వయస్సు 31.. అప్పుల కారణంగా గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గురు వారం మధ్యాహ్నం కోడూరి వెంకటరమణకు చెందిన పొలంలో ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరపల్లి సీఐ కె.బాల సురేష్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వీఆర్‌వో పంచనామా అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. అయ్యప్పకు భార్య, ఏడాది పాప ఉన్నట్లు తెలిపారు.



యనమలను కలిసిన మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13: శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును విజయవాడలో గురువారం మంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సుభాష్‌ను యనమల అభినందించారు. మంత్రి సుభాష్ వెంట టీడీపీ నాయకులు గంధం పల్లంరాజు, రాయపురెడ్డి సూరిబాబు, దొంగల శ్రీధర్ ఉన్నారు.

నిబంధనల మేరకు కొత్త అడ్మిషన్లు

విద్యాశాఖాధికారులతో ఐటీడీఏ పీవో వీడియో కాన్ఫరెన్స్

రంపచోడవరం, జూన్ 13: పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త అడ్మిషన్ చేసుకోవాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయ చాంబరులో విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థులకు వారి అర్హతలను బట్టి అడ్మిట్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని పీవో సూచించారు. ఎటువంటి తప్పులు జరగకుండా ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో మలేరియా దోమల మందును స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయించాలన్నారు. పాఠశాలల్లో వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు అందంగా ఉండేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి డీడీ తేజస్విని, ఏటీడబ్ల్యువోలు రామతులసి, కె.సుజాత, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నంపై హెచ్‌ఆర్సీ స్పందన

చీఫ్ సెక్రటరీ, పునరావాస కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు నోటీసులు

గోకవరం, జూన్ 13: తూర్పుగోదావరి జిల్లా గోకవరం శివారులోని పోలవరం నిర్వాసితుల కాలనీకి చెందిన ఉన్నమట్ల సీతారామయ్య అనే వృద్ధ నిర్వాసితుడు గత నెల 24వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. ఆంధ్రజ్యోతి ఇతర మీడియాలలో వచ్చిన కథనాల నేపథ్యంలో రంపచోడవరం న్యాయవాది ఎంవీఆర్ ప్రకాష్ సంబంధిత సంఘటనపై జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన కమిషన్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం పునరావాస కార్యక్రమాల అమలు, నిర్వాసితులకు చేసిన అన్యాయాలను మీడియా కథనాల ద్వారా పరిశీలించింది. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి, పునరావాస కమిషనర్‌కు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు ఈనెల 11వ తేదీన నోటీసులు జారీ చేసి సంజాయిషీతో పాటు, సమగ్ర నివేదికను కోరింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దేవీపట్నం మండలంలోని సుమారు 36 గ్రామాలు భూములు, ఇళ్లు సర్వస్వం కోల్పోయి ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా రాజమహేంద్రవరం (ధవళేశ్వరం) కేంద్రంగా నడుస్తున్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఈ పునరావాస కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌తో పాటు అనుబంధ అధికారులు నిబంధనలు ప్రకారం పోలవరం నిర్వాసితుల భూములకు నష్ట పరిహారాన్ని, పునరావాస ప్యాకేజీని, పునరావాస కాలనీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో నిర్వాసితులు కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా చంద్రబాబు పాలన అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పునరావాసాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పోలవరం కోసం త్యాగం చేసిన నిర్వాసితులు రోడ్డున పడ్డారు. ఈ పరిస్థితిని భరించలేని ఉన్నమట్ల సీతారామయ్య లాంటి నిర్వాసితులు ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ తనకు అందిన ఫిర్యాదుపై తక్షణం స్పందించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పునరావాస కమిషనర్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదికల ఆధారంగా కమిషన్ తదుపరి చర్యలు తీసుకుంటుంది.

రావులపాడులో ఆయిల్ దుకాణం దగ్ధం




రూ.పది లక్షల ఆస్తి నష్టం

రావులపాలెం, జూన్ 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు పరిధిలో రహదారి చెంతనే ఉన్న ఒక మడ్డి ఆయిల్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కొత్తపేట అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రావులపాలానికి చెందిన నంబూరి రామమురళీమోహన్ రావులపాడు పరిధిలో మడ్డి ఆయిల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో మెకానిక్ షెడ్ల వద్ద నుంచి సేకరించిన పాత ఆయిల్‌ను నిల్వ ఉంచి విక్రయాలు సాగిస్తుంటారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్మేసి చీకటిగా మారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొత్తపేట, మండపేట అగ్నిమాపక శకటాలతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. టాటా ఏస్ వాహనం, పది టైర్ల పాత ట్యాంకరు, నిసాన్ కారుతో పాటు ప్లాస్టిక్ ఆయిల్ పీపాలు, షెడ్డు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు.


ప్రాజెక్టు పత్రాలను అందుకుంటున్న విజయనిర్మల

గోదావరి క్లస్టర్ విశ్వవిద్యాలయానికి యాప్షీ ప్రాజెక్టు మంజూరు

దివాన్‌చెరువు, జూన్13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (యాప్షీ) గోదావరి క్లస్టర్ యూనివర్సిటీకి ప్రాజెక్టు మంజూరు చేశారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌లలో ఒకరైన నన్నయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగ అధ్యాపకులు పి.విజయనిర్మలకు ప్రాజెక్టు పత్రాలను గురువారం వీసీ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులకు వివరాలు అందించారు. యాప్షీ గోదావరి క్లస్టర్ యూనివర్సిటీలైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి, డాక్టర్ వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయాలకు రూ.10 లక్షల ప్రాజెక్టు మంజూరు చేశారన్నారు. ఈ ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్లుగా నన్నయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం అధ్యాపకురాలు విజయనిర్మల, తాడేపల్లిగూడెంలోని ఎన్.ఐ.టి. జీవ సాంకేతిక విజ్ఞానశాస్త్రం అధ్యాపకుడు టి.జగన్మోహనరావు, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం జీవ రసాయనశాస్త్రం ఆచార్యులు డి.ఆర్.సలోమిసునీత వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

89వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న తాతీలు

కరప, జూన్ 13: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడమే గాక యువకులను ప్రోత్సహించి వారితో కూడా రక్తదానం చేయిస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారు కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి నారయ్య(తాతీలు). అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన 89వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. బిక్కవోలు మండలం బాలవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి అమ్ములు అనే మహిళకు అత్యవసరంగా బ్రెయిన్ సర్జరీ చేయాల్సి వచ్చింది. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు బ్లడ్ అవసరమని ఆమె బంధువుల ద్వారా తెలుసుకున్న తాతీలు వెంటనే ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్న తాతీలును ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు బి.శ్రీహరిబాబు, జి.లక్ష్మి తదితరులు అభినందించారు.

40వ సారి రక్తదానం



కొత్తపల్లి, జూన్ 13: జాతీయ రక్తదాన దినోత్సవం (బ్లడ్ డోనర్స్ డే) శుక్రవారం కావడంతో 40వ సారి రక్తాన్ని దానం చేసేందుకు సిద్ధమయ్యారు కొత్తపల్లి మండలం కొత్తమూలపేట సెజ్ పునరావాస ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు అడపా వెంకటశ్రీనివాసరావు. రోడ్డు ప్రమాదాల్లో రక్తం కోల్పోయి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి వారికి రక్తాన్ని దానం చేయడం ద్వారా నిండు ప్రాణాన్ని కాపాడవచ్చునని ఆయన చెప్పారు. రక్తం దానం చేయడం ద్వారా శరీరంలో శక్తి కోల్పోతామన్నది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరూ సంవత్సరానికి ఒకటి లేక రెండు సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. గత సంవత్సరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 39వ సారి రక్తాన్ని దానం చేశానని, చెప్పారు.

చెరువులో పడి అక్కాచెల్లెళ్లు మృతి

- అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో విషాదం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష

అడ్డతీగల జూన్ 13: అడ్డతీగల మండలం సోమన్నపాలెంలో అక్కాచెల్లెళ్లు చెరువులో పడి మృతిచెందారు. ఆలస్యంగా ఆ విషయం వెలుగుచూసింది. సోమన్నపాలెం గ్రామానికి చెందిన వంతల కావ్యశ్రీ (13), సాహితి(10) కాలకృత్యాల కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు బుధవారం వెళ్లారు. ప్రమాదవశాత్తు సాహితీ చెరువులో పడిపోయింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో సోదరి కావ్యశ్రీ కూడా చెరువులోకి జారిపోవడంతో ఇరువురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించారు.


కావ్యశ్రీ


సాహితి

మొక్కు తీర్చుకున్న చంద్రబాబు అభిమాని


చంద్రబాబు ఫొటోతో మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న సుబ్రహ్మణ్యం

కడియం, జూన్ 13: కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు సీఎం అయితే గౌరీపట్నంలో మేరీ మాత ఆలయానికి వచ్చి మోకాలిపై మెట్లు ఎక్కి మేరీ మాతను దర్శించుకుంటానని కడియం గ్రామానికి చెందిన జువ్వల సుబ్రహ్మణ్యం మొక్కుకున్నాడు. కోరిక నెరవేరడంతో చంద్రబాబు ప్రమాణ స్వీకారం రోజున మేరీ మాత ఆలయం వద్ద ఉన్న సుమారు 160 మెట్లను చంద్రబాబునాయుడు ఫొటో పట్టుకుని మోకాళ్లపై ఎక్కాడు. తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు. ఆర్టీసీ డ్రైవరుగా పని చేసే సుబ్రహ్మణ్యం రెండేళ్ల కిందట ఈ మొక్కు మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని అభినందించారు.

పీడీఎస్ బియ్యం సీజ్


బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

అమలాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడులోని ఖాళీ స్థలంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో గురువారం విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం దాడులు నిర్వహించింది. 52 బస్తాల్లో 2645 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. సత్తి సతీష్ అనే వ్యక్తి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పరిసర ప్రాంతాల్లోని మోటారు సైకిలిస్టులనుంచి కిలో రూ.20కు కొనుగోలు చేసి అదే బియ్యాన్ని ఆలమూరు, జొన్నాడ పరిసరాల్లోని ఇటుక బట్టీల కార్మికులకు కిలో రూ.22కు విక్రయిస్తున్నాడు. సదరు బియ్యానికి ఎటువంటి బిల్లులు లేవు. దీంతో రూ.1,28,347 విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. సత్తి సతీష్‌పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్, లోవరాజు, కిశోర్, ఎస్కే ఆలీషా పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఏపీఎన్‌జీవో నేతలు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 13: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన ముద్దాడ రవిచంద్రను ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు సెక్రటేరియట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం తరుపున సహకరించాలని ముద్దాడ రవిచంద్రను ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీ రమణ, పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేఎస్‌వీ ప్రసాద్, జిల్లా ట్రెజరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్ కోరారు.

గోదావరిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించిన స్థానికులు

ఐ.పోలవరం, జూన్ 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల గోదావరిలో గురువారం కొట్టుకుపోతున్న వ్యక్తిని స్థానికులు రక్షించారు. గురువారం మురమళ్ల గోదావరి బ్రిడ్జిపై నుంచి ఒక వ్యక్తి నదిలో పడి కొట్టుకుపోతుండగా బొక్కా నరేష్ వేరొకరి సహాయంతో పడవ ద్వారా అతనిని రక్షించి ఒడ్డుకు చేర్చాడు. అతడి వివరాలు తెలియలేదు. అతడికి మతిస్థిమితం లేదు.


ప్రాణాలతో బయటపడిన వ్యక్తి

ఏజెన్సీ సమాచారం

వరద ముంపు ప్రాంతాల్లో తొలగనున్న కరెంటు కష్టాలు

విద్యుత్ స్తంభాలు మునిగే రెండు ప్రదేశాల్లో స్పన్ ఫోల్స్ ఏర్పాటు

60 అడుగుల వరకు గోదావరి వచ్చినా కరెంట్ కోత ఉండదట



ఫోల్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎటపాక, జూన్ 13: రానున్న వరదల సీజన్‌లో విలీన మండలాల వాసులకు గోదావరి ముంపు కరెంట్ కష్టాలు తొలగనున్నాయి. ఎటపాక మండలంలో ఎటపాక నుంచి బుట్టాయిగూడెం సబ్‌స్టేషన్‌కు వచ్చే 33 కేవీ లైన్‌లో తొలుత ముంపు ప్రభావిత గ్రామాలైన నెల్లిపాక-వీరాయిగూడెం మధ్యతో పాటు, చోడవరం- నెల్లిపాక గ్రామాల మధ్యలోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు గోదావరి వరద ముంపునకు గురవుతాయి. దీంతో భద్రాచలం వద్ద 53 అడుగుల గోదావరి వరద నమోదైతే, ఈ రెండు ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలు ముంపునకు గురై, విలీన మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ప్రతీఏటా వరద సమయంలో విలీన వాసులకు ఈ కరెంట్ కష్టాలు తప్పడం లేదు. వరదల సమయంలో కరెంట్ కష్టాలు తొలగించాలని, ముంపు గ్రామాల్లో ఎత్తైన స్పన్‌పోల్స్ ఏర్పాటు చేయాలని గతంలో విలీన వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రానున్న వరదలను దృష్టిలో ఉంచుకుని ఎటపాక నుంచి బుట్టాయిగూడెం వచ్చే 33కేవీ లైన్‌లో స్పన్ పోల్స్ ఏర్పాటుకు విద్యుత్ ఉన్నతాధికారులు ఆదేశించడంతో గురువారం ఈ రెండు ప్రదేశాల్లోని పాత విద్యుత్ పోల్స్‌ను తొలగించి, ముంపునకు గురికాని 12.5 మీటర్ల స్పన్ పోల్స్‌ను విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో రానున్న వరదల సీజన్‌లో భద్రాచలం వద్ద 60 అడుగుల వరకు గోదావరి పెరిగినా విలీన మండలాలకు కరెంట్ కోతకు డోకా ఉండదని ఏడీఈ మలాకీ ఆంధ్రజ్యోతికి తెలిపారు. జేఈ గెల్లంకి రాజ్‌కపూర్ పనులను పర్యవేక్షించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అడ్డతీగల జూన్ 13: అడ్డతీగల మండలం సోమన్నపాలెం గ్రామనికి చెందిన వంతల కావ్యశ్రీ, సాహితీలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఆమె భర్త, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ గురువారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

పాఠశాలల పునఃప్రారంభం

మోతుగూడెం, జూన్ 13: వేసవి సెలవులు అనంతరం గురువారం



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో గురువారం చింతూరు మండలం మన్యంలో పాఠశాలలకు విద్యార్థులు చలాకీగా బయల్దేరి వెళ్లారు.

ఇందుకూరుపేటలో బీసీజీ వ్యాక్సినేషన్

దేవీపట్నం, జూన్13: టిబి(క్షయ) వ్యాధి రాకుండా ముందస్తుగా అడల్ట్



వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మండలంలోని ఇందుకూరుపేటలో గురువారం నిర్వహించారు. స్థానిక పల్లపు వీధిలోని ఆంజనేస్వామి గుడి వద్ద గ్రామ ప్రజలకు వ్యాక్సినేషన్ వేశారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తప్ప 18 సంవత్సరాలు నిండిన వారంతా ఈ వ్యాక్సినేషన్ వేయించుకుంటే టీబీ నుంచి విముక్తి పొందుతారని వైద్యులు తెలిపారు.

కూనవరం సీపీఐ కార్యదర్శిగా శ్రీనివాసరావు

కూనవరం, జూన్13: కూనవరం సీపీఐ మండల కార్యదర్శిగా లంబు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా సోడె కన్నారావు ఎన్నికయ్యారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారిద్దరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో ప్రజల పక్షాన పోరాడతానని లంబు శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జీవీ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యులు స్వర్ణ, యూనియన్ కార్యదర్శి బుజ్జా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఏరియా గ్రామాల్లో వైద్య శిబిరం

వరరామచంద్రపురం, జూన్13: జీడిగుప్ప పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. గొందూరు, కొల్లూరు, తుమ్మిలేరు తదితర గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ముందస్తు చర్యల్లో భాగంగా మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ టీబీ రాకుండా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోజారమణి, మెడికల్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పనిదినాలు పెంచాలి

ఎటపాక, జూన్ 13: వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే వరకు ఈ ఏడాది ఉపాధి హామీ పనులను 150 రోజులకు పెంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కందుకూరి శైలజ డిమాండ్ చేశారు. గురువారం గన్నవరం గ్రామంలో ఆమె ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలను అడిగి పనుల వివరాలను తెలుసుకున్నారు. కుటుంబంలో 100 రోజులు మాత్రమే పని దినాలు కల్పిస్తే, నెల రోజుల్లో ఆ వంద రోజులు పూర్తవుతున్నాయని అన్నారు. గత ఏడాది వ్యవసాయం దెబ్బతినడంతో అనేక గ్రామాల ప్రజలకు ఉపాధి లేకుండా పోయిందని తెలిపారు. 150 దినాలకు పెంచి, జూలై మొదటి వారం వరకు పనులు కల్పించాలని కోరారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెగా డీఎస్సీపై సంతకంపై హర్షం

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 13: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించగానే మెగా డీఎస్సీపై తొలిసంతకం చేయడంపట్ల యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిజయకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం రాజమహేంద్రవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో బీఈడీ, టీటీసీ చేసిన లక్షలాది మంది నిరుద్యోగులను డీఎస్సీ ద్వారా ఉద్యోగాలలోకి తీసుకోవడం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీరుస్తుందన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల విద్యాకాంతులు ఆరిపోవటానికి సిద్ధంగా ఉన్నాయని ఈ నేపథ్యంలో చంద్రబాబు నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలను బతికించిందన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలకు ఉరితాడులా ఉన్నా జీవో నెం.117ను రద్దుచేయాలని, హైస్కూళ్ళలో మెర్జ్ చేసిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు, తెలుగు మీడియంలు రెండూ కొనసాగించాలని, ఉపాధ్యాయులకు యాప్‌లభారాలను తగ్గించి పూర్తికాలం బోధనకు ఉపయోగించాలని కోరారు.

చంద్రబాబు 5 సంతకాలపై సంబరాలు

కోరుకొండ, జూన్ 13: ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, అవ్వా, తాతల పింఛన్ పెంపు, అన్నా క్యాంటీన్ పునరుద్ధరణ, నైపుణ్య గణాంకాలు వంటి ఐదు సంతకాలు చేయడం పట్ల గ్రామాల్లో రైతులు, నిరుద్యోగులు, యువత, అవ్వా తాతలు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు ఐదు సంతకాలు చేసి ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి మా విధానం అని చెప్పకనే చెప్పారని సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజానీకంగా సంబరాలు చేసుకుంటున్నారు.

మాజీ ఎంపీ భరత్‌రామ్‌కు క్యారెక్టర్, సంస్కారంలేదు

• శిలాఫలకాల ఏర్పాట్లు వద్ద మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



మోరంపూడి ఫ్లైఓవర్ పిల్లర్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13: రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్‌రామ్‌కు క్యారెక్టర్ లేదు, సంస్కారంలేదని అతను తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హెచ్చరించారు. మోరంపూడి ఫ్లైఓవర్ వద్ద గతంలో మాజీ ఎంపీ మురళీమోహన్ పేరుతో ఉన్న శిలాఫలకంను తొలగించడాన్ని తట్టుకోలేక అవేదనతో భరత్‌రామ్ పేరుతో ఉన్న శిలాఫకంను తొలగించిన టీడీపీ నాయకులు వాసిరెడ్డి బాబి తిరిగి తన సొంత ఖర్చులతో మురళీమోహన్ పేరుతో ఉన్నది, ఇటీవల కూలదోసిన శిలాఫలకాలను ఫ్లైఓవర్ ఫిల్లర్ వద్ద ఏర్పాటు చేశారు. దానిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలలో వైద్యం చేయించుకోలేక నీఇంటికి వచ్చిన పేదలకు నువ్వు ఎటువంటి సమాధానాలు చెప్పి గాలికి వదిలేశావో, ఒక వలంటీర్ చెప్పిన మాటకు సుబ్రహ్మణ్యం మైదానం సభలో నాకు చెప్పు చూపించావో అప్పుడు నీ సంస్కారం ఏమిటో ప్రజలకు అర్థమైందన్నారు. అందుకే నిన్ను నీతోపాటు ఆ సభలో ఇష్టానుసారం వాగిన కొడాలి నానిలను ప్రజలు మట్టి కరిపించారని అన్నారు. నా రాజకీయ అనుభవంత వయస్సులేని నువ్వు అభివృద్ధి అంటూ ఏమి అవినీతి అక్రమాలు చేశావో అన్నీ బయటకు తీసుకువస్తామన్నారు. ఆవ భూముల కుంభకోణం, మెయిన్‌రోడ్డు సెంట్రల్ లైటింగ్ స్కాం, సుందరీకరణ పేరుతో దోచేసిన దోపిడీలను అన్నీ బయటకు తీస్తామన్నారు. నువ్వు అవినీతి చేశావు కాబట్టే ప్రజలు నిన్ను తిరస్కరించారని చెప్పారు. జనసేన నేత అత్తి సత్యనారాయ ణ మాట్లాడుతూ రాజకీయాలలో ఆదిరెడ్డి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆవేశంలో కార్యకర్త చేసిన పనిని సరిచేయడమే అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకుడు వాసిరెడ్డి బాబి, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నిరాజు,తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్, యాళ్ళ ప్రదీప్, రాష్ట్ర నాయకుడు యిన్నమూరి దీపు, టీడీపీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, మంత్రమూర్తి రాంబాబు, రాయి అప్పన్న, కాశి విశ్వనాధరాజు, మునిని బాబురావు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా లేని వారిపై మేమెందుకు దాడులు చేస్తాం

• ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాష్ట్రంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ఉన్నా వైసీపీ వాళ్లపై తామెందుకు దాడులు చేస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజానీకం ఇప్పటికే వైసీపీని తిరస్కరించిందన్నారు. రాష్ట్రంలో కేవలం 11 సీట్లకు వైసీపీని ప్రజలు పరిమితం చేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వల్ల రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కిపోయిందని గాడితప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 62 మంది విద్యార్థుల ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో శిక్షణ పొందుతున్న చివరి ఏడాది విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ఎల్ ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. గురువారం జిల్లా పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రాంగణంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, వికాస సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎస్ఎస్‌డీసీ, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ తదితర ప్రముఖ కంపెనీలు శిక్షణ పొందుతున్న ప్రభుత్వ ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల విద్యార్థులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించి నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ కృష్ణన్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ వారి ఆదేశానుసారం, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థ రాజమహేంద్రవరంలో జరిగిన ఇంటర్వ్యూలకు 96 మంది విద్యార్థులు హాజరయ్యారని వారిలో 62 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు. మొత్తం 15 కంపెనీలు హాజరయ్యాయని తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.హరిచంద్రప్రసాద్, శిక్షణాధికారి బి.శివశంకర్, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'మధ్యాహ్నం భోజనం రుచికరంగా వండాలి'

రంగంపేట, జూన్ 13 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలని తూర్పుగోదావరి జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఈవి.వి.ఎస్.ఎస్.ఎస్.బి.ఎల్.నారాయణ అన్నారు. గురువారం రంగంపేట మండలం పాతవీరంపాలెం హైస్కూల్లో మధ్యాహ్నం భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాలు బాగున్నాయా, రుచికరంగా ఉన్నాయా, అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులు చెప్పిన సమాధానంపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులంతా విధిగా పాఠశాలలోనే మధ్యాహ్నం భోజనం చేయాలని ఆయన సూచించారు. అనంతరం మనబడి నాడు నేడు పథకంలో అభివృద్ధి చెందిన అదనపు తరగతి గదులను, పరిసరాలను పరిశీలించి, కట్టడాలను నాణ్యత ప్రమాణంతో నిర్మించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్‌ను అభినందించారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు చేరాయని, మిగతా సామాగ్రి ఈ వారంలో వస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

● బీజేపీ రాష్ట్రస్థాయి ఎన్నికల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి



విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల సమీక్ష సమావేశాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జాతీయ నాయకుడు శివప్రకాష్ జీ, పురందేశ్వరి, నల్లమిల్లి

అనపర్తి, జూన్ 13 : విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన పలు సమావేశాల్లో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. మొదటిగా విజయవాడ సీటీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు భవిష్యత్ కార్యాచర ణపై చర్చించారు. బీజేపీ బలోపేతానికి నాయకులు కృషిచేయాలని కోరారు. అదేవిధంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని బీజేపీ జాతీయ నాయకుడు శివప్రకాష్ జీ ప్రారంభించారు. అనంతరం రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని నాయకులతో నిర్వహించిన సమీక్షలో నాయకులు జిల్లాలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన అంశా లపై చర్చించారు. ఈ సమావేశాలలో మంత్రి సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి, శేఖర్‌జీ, మదుకర్, ఎమ్మెల్యేలు పార్థసారధి, ఈశ్వరరావు, విష్ణుకుమార్, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ వెబ్‌సైట్ పునరుద్ధరణ

● లాంఛనంగా ప్రారంభించిన జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13 : ఆర్యాపురం కోఆరేటివ్ అర్బన్ బ్యాంక్ కస్టమర్ల సౌకర్యార్థం పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను బ్యాంక్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ప్రారంభించారు. గురువారం బ్యాంక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కస్టమర్లకు అవసరమయ్యే సమాచారంను బ్యాంకు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కమిటీ సభ్యులైన జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్ ఎం.జగన్నాధరెడ్డి, డివిజనల్ సహకార అధికారి కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.కామరాజు, బ్యాంక్ సెక్రటరీ కె.స్వరాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ డైరెక్టర్‌కి ట్రైన్ ది ట్రైనర్స్ సర్టిఫికెట్

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 13: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సికింద్రాబాద్‌లో రెండురోజులపాటు ట్రైన్ ది ట్రైనర్స్ వర్క్‌షాప్‌ని ఘనంగా నిర్వహించారు. గోదావరి జిల్లాల నుంచి ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని శిక్షణ తీసుకున్న సంస్థ డైరెక్టర్ మానేపల్లి రమేశ్‌కి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్, చైర్మన్ సుదర్శన్, ఫ్యాకల్టీ గంపా నాగేశ్వరరావుల నుంచి సర్టిఫికెట్‌ని అందుకున్నారు. ఈ సందర్భంగా వాసవియన్స్ ప్రకాశ్, రాజేశ్, సతీశ్, లక్ష్మీనారాయణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోండి

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్లకు కాంట్రాక్టు ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యే గోరంట్లకు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్టు ఎంప్లాయిస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13: రాష్ట్రవాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు గురువారం రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉద్యోగులు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 3600 ప్రభుత్వం మద్యం దుకాణాలలో సుమారు 14వేల మంది ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నామని వారు చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి తమ కుటుంబాలకు న్యాయంచేయాలని వారు కోరారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని గోరంట్ల వారికి చెప్పారు. కార్యక్రమంలో వై.రాజా, రవివర్మ, బి.గిరి, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌కు కడియం నేతల అభినందన



మంత్రి దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కడియం నాయకులు

కడియం, జూన్ 13: నిడదవోలు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఘన విజయం సాధించి మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కందుల దుర్గేష్‌కు కడియం మండలానికి చెందిన కూటమి నాయకులు గట్టి నర్సయ్య, ఆదిమూలం సాయిబాబు, గట్టి సుబ్బారావు, ముద్రగడ జమీ, పంతం గణపతి, నాగిరెడ్డి రామకృష్ణ, కర్రి యేసయ్య, చిలుకూరి నాగేశ్వరరావు, సూరిబాబు కలిసి మంత్రి దుర్గేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వేమగిరిలో వైద్యశిబిరం

కడియం, జూన్ 13: వేమగిరిలో పంచాయతీ కార్యాలయంవద్ద కోలా వెంకట్రాజు (కేవీఆర్) సంస్థ గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరంకు చెందిన ఆస్పత్రుల సౌజన్యంతో బీపీ, షుగర్, గుండె, దంత, కంటి వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రమ్య, విజయ్, యశ్వంత్, వంశీకృష్ణంరాజు తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. కోలా వెంకట్రాజు మనుమరాలు డాక్టర్ రమ్య స్వగ్రామంలో ప్రజలకు వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కోలా నరసింహమ తెలిపారు.

ప్రతి చేనుకు నీరు అందిస్తాం


● సీతంపేటలో పంపింగ్ స్కీమ్ ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల

● రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్


ఉండ్రాజవరం, నిడదవోలు, మే 13 : పతి చేనుకు నీరు- ప్రతి ఒక్కరికీ పని అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు మండలంలో సీతంపేటలో పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు సాగునీరు విడుదలచేసే కార్యక్రమాన్ని గురువారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అన్నంపెట్టే రైతుల పొలాలకు సాగునీరు అందించే కార్యక్రమం మంత్రిగా పదవి చేపట్టిన తొలిసారిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ చెప్పారు. రైతులకు అండగా ఉంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వంటి అపార అనుభవం గల నాయకులతో కలసి పనిచేస్తూ, నియోజవర్గ అభివృద్ధి, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ప్రభుత్వం పక్షాన తగిన సహాయసహకారాలు అందించేందుకు అందుబాటులో ఉంటానని రాష్ట్ర మంత్రి దుర్గేష్ వివరించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ నియోజవర్గం అన్ని విధాలా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. తొలుత మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నియోజకవర్గానికి వచ్చిన మంత్రి దుర్గేష్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీగా వెళ్లి పలు దేవాలయాల్లో మంత్రి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఇరిగేషన్ ఈఈ ఎమ్. దక్షిణామూర్తి, డీఈ సత్యదేవ, జేఈ ఎస్.కిరణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ అమ్మవా రిని రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ గురువారం దర్శించుకున్నారు. మంత్రిగా పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా నిడదవోలు వచ్చిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావులు కలసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి దుర్గేష్‌కు పూలమాల వేసి, అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ నిర్వహకులు అందజేసారు. కార్యక్రమం లో ఆలయ ఫౌండర్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.








ఐదు సంతకాలు..
హర్షాతిరేకాలు!

- పింఛన్‌దార్లకు ఇక నెలకు రూ.4 వేలు
- దివ్యాంగులకు నెలకు ఇక రూ.6 వేలు
- ఏప్రిల్ నుంచి అమలు.. జూలై నుంచి పంపిణీ
- జిల్లాలో రూ.92 కోట్లకు చేరనున్న పింఛన్ల సొమ్ము
- పింఛనుదారులకు ఇక నెలనెలా సంతోషమే
- ఇప్పటివరకూ రూ.71కోట్లు పంపిణీ
- మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఆనందం
- త్వరలో అన్నాక్యాంటీన్లు ప్రారంభం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- నైపుణ్య గణనతో మరో కీలక నిర్ణయం
- నిరుద్యోగులకు ఈ గణనతో కొత్త ఆశలు



బాబు తొలి సంతకం

ఒకటి కాదు.. ఒకేరోజు ఏకంగా ఐదు సంతకాలు.. ఈ అయిదూ కీలక నిర్ణయాలే. ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నది ఇలాంటి క్షణాల కోసమే. ముఖ్యంగా పింఛనుదారులు, యువకులు వేయికళ్లతో వేచిచూస్తున్నది ఈ సంతకాల కోసమే. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పింఛను రూ.3 వేలు చేస్తామని హామీ ఇచ్చి.. అధికారం చేపట్టాక జగన్ మాటమార్చారు. పెంచుకుంటూ పోతామని చెప్పానని, అందుకే ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ వచ్చి ఇచ్చిన మాట తప్పారు. ఇప్పుడు చంద్రబాబు రూ.4 వేల పింఛను, దివ్యాంగులకు రూ.6 వేల పింఛను ఇస్తానని హామీ ఇచ్చి తొలి రోజునే సంతకం చేశారు. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఏళ్ల తరబడి చూస్తున్న నిరుద్యోగులకు సంతోషం కలిగించేలా తొలి సంతకం డీఎస్సీపైనే పెట్టారు. అలాగే అన్నాక్యాంటీన్లు ప్రారంభించడంతోపాటు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తూ మరో రెండు సంతకాలు.. నైపుణ్య గణన చేసేందుకు మరో కీలక నిర్ణయంపైనా మరో సంతకం చేశారు. ఇవన్నీ కీలక నిర్ణయాలే కావడంతో ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు తొలుత ఐదు హామీలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయడంతో అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పింఛనుదార్లకు నెలకు రూ.4 వేల పింఛను, అన్నక్యాంటీన్లను తెరవడం, నైపుణ్య గణన వంటి ఐదు హామీల మీద ఆయన గురువారం వెలగపూడి సచివాలయంలో బాధ్యతలు తీసుకున్న వెంటనే సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ఆయా నిర్ణయాలకు సంబంధించి గణాంకాలను సిద్ధంచేస్తున్నారు. అలాగే పించన్లను నెలకు రూ.4 వేలు చేయడం, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచడం వల్ల తూర్పుగోదావరి జిల్లాలో సుమారు నెలకు రూ.20 కోట్లు అదనంగా అవసరమవుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకూ జిల్లాలో మొత్తం 18 రకాల పింఛన్ లబ్దిదార్లు 2,42,300 మంది ఉన్నారు. వారికి నెలకు రూ.71,92,21,700 పంపిణీ అవుతోంది. కానీ ఇంతవరకూ రూ.3 వేలు పొందేవారికి రూ.4 వేలు, ఇంతవరకూ నెలకు రూ.3 వేలు పొందుతున్న దివ్యాంగులకు ఇక నెలకు రూ.6వేలు చేయడం వల్ల జిల్లాలో ఇక నెలకు అదనంగా మరో రూ.20 కోట్లు భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ పెంపుతో జిల్లాలోని వేలాదిమంది పింఛన్‌దార్లు చాలా ఆనందపడుతున్నారు. వృద్ధులు, వితంతువు, దివ్యాంగులు వంటి పింఛన్‌దార్లకు ఇది చాలా ఉపయోగపడుతుందని, బతుకుకు భరోసా అని చెబుతున్నారు. ఇక ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందపడుతున్నారు. వైసీపీ తీసుకొచ్చిన ఈ చట్టం వల్ల తమ భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని.. అధికారం, నోరు, డబ్బు ఉన్నవారిదే పెత్తనం అవుతుందని ప్రజలు తీవ్రంగా భయపడిపోయారు. ఎవరైనా తమ భూమిని కబ్జా చేస్తే కోర్టు వెళ్లే అధికారం కూడా లేకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. కానీ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండో సంతకం ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు ఫైల్‌పై సంతకం పెట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించే ఫైళ్ల మీద కూడా ఆయన సంతకం పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల కోసం రూ. 5కే అన్నం పెట్టే అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆసుపత్రుల వద్ద, వివిధ కూడళ్లలోనూ ఈ క్యాంటీన్లను ఏర్పాటుచేసి భోజనం పెట్టేవారు. కానీ 2019లో జగన్ సీఎం కాగానే వీటిని కూడా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్యాంటీన్లు ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి కూడా వచ్చేవారికి, కాలేజీలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు, సిటీలో కూలీనాలీ చేసుకునే పేదలకు, ఇతర ప్రాంతాల నుంచి పనుల మీద వచ్చేవారికి కూడా ఇది చాలా ఉపయోగపడేది. కేవలం ఐదు రూపాయలకే ఆకలి తీర్చేది. వాటిని తిరిగి తెరిచే నిర్ణయం కూడా చంద్రబాబు తీసుకోవడంతో పేద వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొంతగా చంద్రబాబు నైపుణ్య గణన అనే కార్యక్రమాన్ని ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంట్లో ఎవరికి ఏ రంగంలో నైపుణ్యం ఉందో తెలుసుకునే క్రమంలో ప్రతీ ఇంటా ఈ సర్వే చేస్తారు. ఎవరికి ఏ నైపుణ్యం ఉందో వివరాలు సేకరించి తదనుగుణంగా ఆయా వర్గాలవారికి మేలు చేసే నిర్ణయాలు అమలుచేయనున్నారు. ఈ పథకం కూడా అన్ని వర్గాలకు మేలు చేసేది కావడంతో కీలకంగా మారింది.

పింఛన్‌దార్ల వివరాలివీ...

జిల్లాలో 18 రకాల పింఛన్‌దార్లు ఉన్నారు. అభయహస్తం కింద జిల్లాలో 5734 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.500 ఇస్తారు. అమరావతి రాజధానికి ల్యాండ్స్ ఇచ్చినవారు ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున పింఛన్ ఇస్తున్నారు. సీకేడీయూ (డయాలిసిస్) ప్రభుత్వ వైద్యం పొందేవారు 182 మంది, ప్రైవేట్ వైద్యం పొందేవారు 219మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.10 వేల వంతున పింఛన్ అందుతోంది. డప్పు కళాకారులు జిల్లాలో 745 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. దివ్యాంగులు జిల్లాలో 32,962 మంది ఉన్నారు. ఇప్పటివరకూ వీరికి నెలకు రూ.3 వేలు ఇస్తుంటే కూటమి ప్రభుత్వం రూ.6 వేలు ఇవ్వనుంది. డీఎంహెచ్ ద్వారా పింఛన్ అర్హత ఉన్నవారు 1795 మంది ఉన్నారు. వారికి రోగాన్ని బట్టి రూ.3 వేలు, రూ.5 వేలు, రూ.10వేలు ఇస్తున్నారు. మత్స్యకార పింఛన్ కూడా ఉంది. జిల్లాలో 1917 మంది మత్స్యకార పింఛన్‌దార్లు ఉన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నెలకు రూ.4 వేలు వస్తుంది. వృద్ధాప్య పింఛన్లు పొందేవారు జిల్లాలో 119922 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.3 వేలు మాత్రమే వస్తుంది. ఇక నుంచి నెలకు రూ.4 వేలు ఇస్తారు. కళాకారుల పింఛన్ కింద జిల్లాలో 154 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం నెలకు రూ.3 వేలు వస్తుంది. ఇక నెలకు రూ.4 వేలు ఇస్తారు. సైనిక్ వెల్ఫేర్ కింద 17మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.5 వేలు ఇస్తున్నారు. ఒంటరి మహిళ పింఛన్ పొందేవారు 9132 మంది ఉన్నారు. ఇప్పటివరకూ వీరికి రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నాలుగు వేలు ఇస్తారు. గీత కార్మికులు 2466 మంది ఉండగా వీరికి కూడా నెలకు రూ.4 వేలు ఇస్తారు. ట్రాన్స్‌జెండర్లు 60మంది ఉన్నారు. వీరికి కూడా నెలకు 3 వేలు ఇస్తున్నారు. ఇక నాలుగు వేలు ఇస్తారు. చేనేత కార్మికులు 1324మంది ఉన్నారు. వీరికి కూడా 3 వేలు ఇస్తున్నారు. ఇక 4 వేలు ఇస్తారు. వితంతు పింఛన్లు పొందేవారు 64,813 మంది. వీరికీ రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నెలకు రూ.4 వేలు ఇస్తారు. చెప్పులు కుట్టేవారు 855 మంది వరకు ఉన్నారు. వారికీ నెలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ఇక నెలకు రూ.4 వేలు ఇస్తారు. మొత్తం జిల్లాలో 2,42,300 మంది పింఛనుదార్లు ఉండగా, వారికోసం నెలకు సుమారు రూ.71 కోట్ల, 92 లక్షల 17 వేలు లబ్ధిపొందుతున్నారు. ఇది మరో రూ.20 కోట్లు పెరిగి, ఇక నెలకు రూ. 92 కోట్ల వరకూ అవసరం అవుతుంది. ఈ పథకం ఏప్రిల్ నుంచి పంపిణీ చేస్తుండడం వల్ల మూడు నెలలకు మరింత అదనంగా నిధులు అవసరం.

పేదల ఆకలి తీర్చే దేవుడు..



గత ఐదేళ్లుగా చాలా ఇబ్బందులుపడ్డాం. రూ.5కు పట్టెడన్నం పెట్టిన చంద్రబాబు అధికారంలో లేక అన్నా క్యాంటీన్లు నిలుపుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్నా క్యాంటీన్లు మూసివేయడంతో చాలామంది ఆకలి బాధలు పడ్డారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా అన్నాక్యాంటీన్లు తెరిపించడం చాలా ఆనందాన్ని ఇస్తోంది. ఎంతోమంది ఆకలి బాధలు తీరనున్నాయి.

- షేక్ మస్తానీ, రాజమహేంద్రవరం

థ్యాంక్యూ సీఎం సార్..



రాష్ట్రంలో బీఈడీ పూర్తి చేసి ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నవారు లక్షలాది మంది ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు మాట ఇచ్చారు. నేను భీమవరంలో పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం కూడా ఇచ్చా. మొత్తానికి తొలి సంతకం చంద్రబాబు మెగా డీఎస్సీపై చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను ఎంఏ బీఈడీ చేశా. థ్యాంక్యూ సీఎం సార్.

- సన్నంగి సత్యవతి, రాజమహేంద్రవరం

సంతోషంగా ఉంది



ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో టెట్ క్వాలిఫై అయ్యి 8 ఏళ్లు గడుస్తోంది. జగన్ జాబ్ క్యాలెండర్ తీస్తాడని 5 ఏళ్లు ఎదురుచూశాం. ఇటు ఉద్యోగం రాక.. అటు తల్లిదండ్రుల మాట కాదనలేక వివాహం చేసుకున్నా. జగన్ మోసంతో చేశారు. బాబు డీఎస్సీపై తొలి సంతకం సంతోషాన్నిచ్చింది.

- పావని, గోపాలపురం

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేసిన చంద్రబాబుకు ధన్యవాదాలు

- ముప్పాళ్ల సుబ్బారావు



వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ప్రముఖ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. ప్రజల ఆస్తుల భద్రతకు ప్రమాదకరంగా పరిణమించిన ఆ చట్టాన్ని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. జగన్ సర్కార్ అరాచక పాలనకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఒక నిదర్శనమని ముప్పాళ్ల మండిపడ్డారు.

రైతులు ఊపిరి పీల్చుకున్నారు




రైతులకు చెందిన భూములపై హక్కు కోల్పోయే విధంగా రూపొందించిన లాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబునాయుడు రద్దు చేయడంతో రైతులు అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వం ఈ యాక్ట్‌ను తీసుకువచ్చింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. రైతుల పాస్‌బుక్‌లపై సీఎం ఫొటో ఉండేది. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు. రైతుల బాగోగులు ఆయనకు తెలుసు. అందుకే లాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశారు. - పిల్లా శ్రీనివాస్, కడియపులంక నర్సరీ రైతు

- రాజమహేంద్రవరం సిటీ, కడియం, గోపాలపురం

'తూర్పు'కిక మహర్దశ

- అభివృద్ధిలో బంధుత్వాలు కలిసొచ్చే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో రెండు ప్రధాన పార్టీల రాష్ట్రాధ్యక్షులు
- ఇటు పురందేశ్వరి, అటు పవన్‌కల్యాణ్‌పై ఎన్నెన్నో ఆశలు
- ఉమ్మడి ప్రభుత్వానికి బీజం పడిందీ.. కీలక మలుపులూ ఇక్కడే
- 2027 పుష్కరాలూ చంద్రబాబు హయాంలోనే..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)



దెబ్బతిన్న సింహం శ్వాస కూడా గర్జనకంటే భయంకరంగా ఉంటుందంటారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా 'చంద్రబాబు అనే నేను' అనే పదంలో అదే ధ్వనించింది. ఆ గర్జనతో రాష్ట్రానికి పట్టిన చీకటి పటాపంచలైపోయింది. రాష్ట్రం మళ్లీ గాడిలో పడింది. అయితే తమ ప్రాంతానికి మహర్దశ పట్టనుందనే ఆనందంలో గోదావరి తీరవాసులు సంబరపడుతున్నారు. దశ తిరగనుందని భావిస్తున్నారు. ముందు నుంచీ టీడీపీని తూర్పువాసులు ఇంట్లో కుటుంబ సభ్యుడి మాదిరిగా ఆదరించారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ అయితే తెలుగుదేశానికి కంచుకోట అని చెప్పక తప్పదు. గత ఎన్నికల వైసీపీ సుడిగాలిలో కూడా ఈ రెండు చోట్లా టీడీపీని కదిలించలేకపోయారు. ఇప్పుడు అంతకుమించి అక్కున చేర్చుకున్నారు. జనం ఐదేళ్లుగా ఎదురు చూసిన 'చంద్రోదయానికి అంకురార్పణ మన 'తూర్పు'లోనే జరగడం విశేషం. ఇక తూర్పుగోదావరిలో పదవులు అలంకరించిన వారి బంధుత్వాలు జిల్లాకు కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో, కేంద్రంలో కీలకంగా మారిన నేతలకు జిల్లాలోని ప్రజాప్రతినిధులతో దగ్గరి బంధుత్వాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ముఖ్యమంత్రి చంద్రబాబు మరిది అవుతారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి పురందేశ్వరి స్వయానా అక్క. అలాగే రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు బావమరిది, ఆయన సతీమణి భవానీ తమ్ముడు కింజారపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర ప్రభుత్వ కేబినెట్‌లో పౌర విమానయాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. భవానీ చిన్నాన్న కింజారపు అచ్చెన్నాయుడు రాష్ట్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ బంధుత్వాలు జిల్లాకు ముఖ్యంగా రాజమహేంద్రవరం నగర రూపు రేఖలు మార్చడంలో ఎంతగానో సహాయపడతాయనే చర్చ నడుస్తోంది.

● అనుభవం కలిసొస్తే...

ఎంపీ విజేత పురందేశ్వరికి అటు రాజకీయం ఇటు పరిపాలనాపరంగా అపార అనుభవం ఉంది. ఎన్టీఆర్ కూతురిగా మరింత అభిమానం ప్రజల్లో ఉంది. ఆమెకు కేంద్ర ప్రభుత్వంలో చెప్పుకోదగిన పరిచయాలు ఉన్నాయి. గతంలో కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. ఢిల్లీలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలతోపాటు ప్రధాని మోదీ దగ్గరకు కూడా సునాయాసంగా వెళ్లగల పలుకుబడి ఉంది. ఆమె గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఇటు జిల్లా యువతకు, అభివృద్ధికి పనిచేస్తుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కేంద్రం నుంచి భారీ ప్రాజెక్టులు వస్తే ఐదేళ్ల నుంచీ ఉపాధి లేక ఎదురు చూస్తున్న యువతకు ఊతమవుతుందని ఆశిస్తున్నారు. అలాగే అభివృద్ధి విషయంలోనూ ముఖ్యంగా రాజమహేంద్రవరాన్ని పట్టిపీడిస్తున్న ముంపు నీరు, కలుషిత తాగునీరు, డెడికేటెడ్ చానెల్, పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి, గోదావరిపై రైలు మరో రైలు వంతెన వంటి వాటికి కేంద్ర నిధులతో పరిష్కారం దొరకుతుందని ఆశిస్తున్నారు. నిడదవోలు శాసనసభ నుంచి గెలిచి మంత్రి పీఠం దక్కించుకున్న కందుల దుర్గేశ్‌కి కూడా పరిపాలనా అనుభవంతోపాటు జిల్లాపై పూర్తిస్థాయిలో పట్టుంది. సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి వాసు రాజకీయంగా కాస్త అనుభవం ఉన్నా పరిపాలనాపరంగా పట్టు సాధించాల్సి ఉంది. ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు, చినమామ కింజారపు అచ్చెన్నాయుడు, బావమరిది రామ్మోహన్‌నాయుడుకు ఉన్న రాజకీయ, పరిపాలనా అనుభవం ఆదిరెడ్డి వాసుకు కలిసొచ్చే అంశమే. ఇవన్నీ జిల్లా అభివృద్ధిని పరుగు పెట్టిస్తాయని గోదావరోళ్లు ఎదురు చూస్తున్నారు.

రెండు పార్టీల రాష్ట్రాధ్యక్షులు

ఉమ్మడి తూర్పుగోదావరికి మరొక ప్రాముఖ్యత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని రెండు చోట్ల కీలకమైన పార్టీల అధ్యక్షులు బరిలో దిగి అదరగొట్టారు. పిఠాపురం శాసనసభ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత కొణిదల పవన్‌కల్యాణ్ ఘన విజయం సాధించారు. డిప్యూటీ సీఎం హోదాను పవన్‌కల్యాణ్‌కి ఇచ్చి కూటమి గౌరవించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన ఇప్పుడు పిఠాపురం నియోజకవర్గ రూపురేఖలు మారుస్తారని ప్రజలు బలంగా ఆశిస్తున్నారు. పవన్ కూడా తనను ఆదరించిన నియోజకర్గానికి ఏదొక శాశ్వత మేలుచేయాలనే తపనతో ఉన్నట్టు చెబుతున్నారు. పవన్ డిప్యూటీ సీఎం కూడా కావడంతో ఉమ్మడి తూర్పునకు కూడా గట్టి మేలు జరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం ఎంపీ విజేత పురందేశ్వరి బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు. బీజేపీలో మంచి పలుకుబడి ఉంది. కీలకమైన పదవులు అలంకరించిన అనుభవం ఆమె సొంతం. బీజేపీతోపాటు కేంద్ర, రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో కూడా మంచి సఖ్యత ఉంది. పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు మేలు జరగడం ఖాయమని భావిస్తున్నారు.

2027 పుష్కరాలూ చంద్రన్న హయాంలోనే..

గత పుష్కరాలకు 2015లో చంద్రబాబు ఏకంగా 12 రోజులు ముఖ్యమంత్రి హోదాలో రాజమహేంద్రవరంలోనే బస చేశారు. కేబినెట్ సమావేశం సైతం ఇక్కడే నిర్వహించారు. గోదావరి ఘాట్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు ఇచ్చారు. దేశంలోనే పెద్దదైన కోటిలింగాల ఘాట్‌ను అప్పుడే నిర్మించారు. నగరమంతా అద్దంలా తీర్చిదిద్దారు. అప్పట్లో కొందరు అధికారుల అలసత్వం వల్ల తొలిరోజున ఊహించని ఉప్పెన ఎదురైనా ఎక్కడా నిబ్బరం కోల్పోలేదు. వైసీపీ శవరాజకీయాలు చేసినా చలించలేదు. వందల మంది అధికారులు, సిబ్బంది ఉన్నా.. చంద్రన్నే స్వయంగా లోటుపాట్లను తెలుసుకొని తక్షణ పరిష్కారం చూపిస్తూ పుష్కరాలను ఔరా అనిపించారు. రైల్వేస్టేషను, బస్టాండ్, యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాలు తదితర చోట్లకు అర్ధరాత్రి వేళలో కూడా వెళ్లి సదుపాయాలపై ప్రజలను ఆరా తీసేవారు. బ్రిటిష్ వాళ్ల నాలిక తిరగక చారిత్రక నగరానికి మార్చేసిన పేరును మళ్లీ తీసుకొచ్చారు. రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మార్పుచేస్తూ ఇక్కడే చంద్రబాబు ఒక ప్రకటన చేశారు. మొత్తానికి ఓ మినీ కుంభమేళా మాదిరిగా ఆ ఏడాది పుష్కర ఉత్సవాలు జరిగాయి. ఈ పుష్కరాలకు జ్ఞాపకంగా దివాన్‌చెరువు సమీపంలో ఉన్న అటవీ వనాన్ని పుష్కర వనంగా తీర్చిదిద్ది నగర ప్రజలకు కానుకగా ఇచ్చారు. 2027లో మళ్లీ ఆయన చేతుల మీదుగానే పుష్కరాల క్రతువును గోదారమ్మ నిర్వహించుకోనుంది.



కువైట్ అగ్ని ప్రమాదంలో...
మనవాళ్లు ఇద్దరు మృతి

ఒకరిది ఖండవల్లి..
మరొకరిది అన్నవరప్పాడు
నాలుగు రోజుల్లో ఇంటికి రావాల్సి ఉండగా ఘోరం
పదేళ్ల నుంచి కువైట్‌లోనే ఉద్యోగం

- మెయిన్ 2లో



సీతంపేటలో పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు సాగు నీరు విడుదలచేసే కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ప్రతి చేనుకు నీరు అందిస్తాం

సీతంపేటలో పంపింగ్ స్కీమ్ ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల : రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

- 8లో



బీసీ హాస్టల్ దుస్థితిపై పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్

బీసీ హాస్టల్ దుస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 13: రాజమహేంద్రవరంలో వై జంక్షన్ సమీపంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల దుస్థితిని సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎన్నికలకు ముందు చూసి చలించిపోయారు. ఇంత దారుణ పరిస్థితిలో బీసీ బాలలు ఇక్కడ చదువుకుంటున్నారా అని ఆవేదన చెందారు. ఎన్నికల తర్వాత టాయిలెట్స్ నిర్మిస్తామని, తగిన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కాగానే విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో ప్రభుత్వ శాంక్షన్ తీసుకుని నిర్మించేలోగా ఆలస్యమవుతుందని గ్రహించిన ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరంలోని కిమ్స్ హాస్పటల్ వారి సహకారంతో వై జక్షన్‌లో బాలుర వసతి గృహం, దేవీచౌక్‌లో బాలికల వసతి గృహంతో కలిపి మొత్తం 30 టాయిలెట్లు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వాటిని గురువారం ఆయన పరిశీలించారు. త్వరగా టాయిలెట్ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. వసతిగృహంలో టాయిలెట్ల సమస్యను వేగంగా పరిష్కరించిన ఎమ్మెల్యేకు విద్యార్థులు, బీసీ సంఘాలు ధన్యవాదాలు తెలిపాయి.

బీసీ కార్డుతో గెలిచి బీసీలకు అన్యాయం

వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్డుతో మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎదిగిన వారెవ్వరు బీసీలకు న్యాయం చేయలేకపోయారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే విజేత ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బీసీ వసతి గృహంలో టాయిలెట్ నిర్మాణాలను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో జిల్లా ఇంచార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ ఆ స్థాయికి రావడానికి బీసీ కార్డే కారణమన్నారు. అటువంటి మంత్రి ఉండి కూడా బీసీ వసతి గృహాల్లో కనీస సదుపాయాలు లేవన్నారు. అంత దారుణంగా వాటిని గాలికి వదిలేశారని చెప్పారు. సమస్యను పరిశీలించిన తాను ఎమ్మెల్యే కాకముందే వెంటనే చర్యలు చేపట్టానని, బీసీ వసతి గృహాల్లో టాయిలెట్ సమస్యను పరిష్కరించామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిందని, అతి త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, శెట్టిబలిజ సాధికార సమితి కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్, రాష్ట్ర నాయకులు యిన్నమూరి దీప్తు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ళ ప్రదీప్, మంత్రమూర్తి రాంబాబు, శెట్టి జగదీష్, బుడ్డిగ రవి, కాశి విశ్వనాథరాజు పాల్గొన్నారు.

అనపర్తి సావరంలో దాడికి రాజకీయాలకు సంబంధం లేదు: ఎస్పీ

రాజమహేంద్రవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అనపర్తి సావరంలో గురువారం రెండు వర్గాల మధ్య జరిగిన దాడికి రాజకీయాలకు ఎలాంటి సంబంధమూ లేదని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీ కార్యకర్తలు దారికాచి రాడ్లు, కర్రలతో దాడికి దిగారంటూ వదంతులు వ్యాప్తి చేస్తున్నారని చెప్పారు. గ్రామానికి చెందిన చల్లబోయిన కృష్ణ, చల్లబోయిన అప్పన్న బాబులకు అదే గ్రామంలోని మేడిశెట్టి అర్జున్ వాళ్ల కుటుంబాలకు పంచాయతీకి చెందిన ఖాళీ స్థలంలో ఉన్న కనకదుర్గమ్మ గుడి విషయంలో సుమారు 5 నెలల నుంచీ గొడవలు జరుగుతున్నాయని, వివాదం పెద్దల వరకూ వెళ్లినా పరిష్కారం కాలేదని ఎస్పీ వివరించారు. ఇరు వర్గాలూ గుడి విషయమై మళ్లీ గొడవపడగా గాయాలు అయ్యాయని, కేసులు నమోదు చేశామని వెల్లడించారు. ఇద్దరిని బైండోవర్ చేశామన్నారు. ఇది గుడికి సంబంధించిన వివాదమేగానీ, రాజకీయాలు సంబంధం లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేవిధంగా సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా అవాస్తవాలను వ్యాప్తిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్ - సిటీ

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం


దేవరపల్లి వెంకటేశ్వరస్వామికి వెండికిరీటం అందజేస్తున్న దాతలు

స్వామి,అమ్మవార్లకు వెండి కిరీటం బహూకరణ

దేవరపల్లి, జూన్ 13: దేవరపల్లిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి ,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు దేవరపల్లి గ్రామానికి చెం దిన భారతీయ స్టేట్‌బ్యాంక్ మాజీ మేనేజర్ సింగులూరి సుధాకర్ రమాదేవి దంపతుల కుమారుడు శ్రీనివాస సత్యరామతేజ వెండి కిరీటాలను బహూకరి ంచారు. సుమారు లక్షా70వేలు విలువచేసే ఈ కిరీటాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలకు అమర్చారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన కుమారుడు శ్రీనివాససత్యరామ్‌తేజ ఇంగ్లాండ్‌లో ఉద్యోగం చేస్తున్నాడని స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహా లకు వెండి కిరీటం అందజేస్తానని మొక్కుకున్నారని గురువారం ఆలయ కమిటీకి వెండి కిరీటాలు ఆలయ కమిటీకి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, స్థానికులు యాగంటి వెంకటేశ్వర రావు, చిట్లు ప్రసాద్, నందిగం బులిరాజు, గుడ్ల వెంక టేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్వో అసోషియేషన్ కార్యవర్గం ఏర్పాటు


నల్లజర్ల మండల వీఆర్వోలు

నల్లజర్ల, జూన్ 13 : వీఆర్వో అసోషియేషన్ నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి తెలిపారు. గురువారం నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.శామ్యూల్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వరి,కార్యదర్శిగా టి.శ్రీదేవి, కోశాధికారిగా ఎం.మాధవి, అసోసియేట్ కార్యదర్శిగా కె.శ్రీనివాస్ కమిటీ ఉన్నారు.

నాకు ప్రాణ హాని ఉంది

● నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్


విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్ ఆరోన్

దేవరపల్లి, జూన్ 13: నాకు ప్రాణ హాని ఉందని అజ్ఞాత వ్యక్తులు పుణ్యక్షేత్ర పరిసరాల్లో తిరుగుతూ కొంత కాలంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి పుణ్యక్షేత్రం హాలులో గురువారం విలేఖర్ల సమావేశంలో జాన్‌పీటర్ మాట్లాడుతూ ఇటీవల కొంతమంది వ్యక్తులు ఫోన్‌చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని దీనికి తాను నిరాకరించటంతో బెదిరింపు ఫోన్లు చేస్తున్నారని అన్నారు. దైవసేవ చేసుకుంటూ భక్తులకు పుణ్యక్షేత్రంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న తనను బెదిరిస్తున్నారని అన్నారు. పుణ్యక్షేత్రాన్ని కించపరిచే విధంగా అసత్య ప్రచారాలు పీడీఎఫ్ పేపర్లలోనూ, వాట్సాప్ గ్రూపుల్లో, ఫేస్‌బు క్‌లలో అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. అసత్య ప్రచారాలు చేస్తూ కొంతమంది వ్యక్తులు డబ్బు కోసం బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, అదేవిధంగా యూట్యూబ్ ఛానల్స్‌పై పరువునష్టం దావా వేస్తున్నా మన్నారు. కొంతమంది తనను బెదిరిస్తున్న వారి వలన ప్రాణభయం కలుగు తుందని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయ నున్నట్లు తెలిపారు. బిషప్ కౌన్సిల్ మెంబర్ దివిసిల ఆరోన్ మాట్లాడుతూ గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ పని చేసినప్పుడు కూడా కొంతమంది వ్యక్తులు నక్సలైట్లు, జనశక్తి అంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేవారని, డబ్బులకు డిమాండ్ చేసే వారని అన్నారు. పుణ్యక్షేత్రంపై అసత్య ప్రచారాలు చేసిన డబ్బుల కోసం డిమాండ్ చేసిన అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పాఠశాలలు పునఃప్రారంభం

తాళ్ళపూడి, జూన్ 13: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను గురువారం పునఃప్రారంభించారు. ఈ నెల 12న ప్రారంభించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కొలువు తీరనున్న సందర్భంగా వేసవి సెలవులు ఒక రోజు పెంచి గురువారం నుంచి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉచిత పాఠ్య పుస్తకాలు, బ్యాగ్స్, నోట్‌బుక్స్, షూ, టై వంటి అన్ని వస్తువులూ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యా శాఖాధికారి మాట్లాడుతూ 1నుంచి 5 వరకూ గల విద్యా ర్థులకు టెక్స్ట్ బుక్స్ 5077, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ 18145, నోట్‌బుక్స్ 22,166 పుస్తకాలు వచ్చాయని 3075 బ్యాగ్స్, 2063 బెల్ట్స్, 3148 షూస్ వచ్చాయని తెలిపారు.


కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు: కొవ్వూరు పట్టణ, మండలంలో వేసవి సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. గురువారం కొవ్వూరు పట్టణంలోని హోలి ఏంజిల్స్ పాఠశాల విద్యార్థులు మనబడి అమ్మఒడి, పెద్దలు పనికి, పిల్లలు బడికి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం మొదటిరోజు విద్యార్థులు పాఠశాలలకు తరలివెళ్లారు.

'మనుషుల అక్రమ రవాణాను అరికట్టాలి'

చాగల్లు, జూన్ 13: మనుషుల అక్రమ రవాణాను అరికట్టడం మన అందరి బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా పనిచేయాలని నిడదవోలు ఐసీడీఎస్ సీడీపీవో డి. మమ్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ (హైదరాబాద్) వారిచే జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నేటి యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురవుతున్నారన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి మెస్సేజ్‌లు, కాల్స్ వస్తే జాగ్రత్తగా ఉండాలని, ఇబ్బంది కలిగిన సందర్భంగా 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. సినిమాలు, ఉద్యోగం, డబ్బు పేరుతో ఆశ పెట్టి వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ, సుప్రియ, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాదు అమ్మవారి ఆరాధనోత్సవాలు

ఉండ్రాజవరం, జూన్ 13: మండలంలోని చివటం గ్రామంలో సాదు అమ్మవారి ఆరాధనోత్సవాలు గురువారంతో ముగిశాయి. మూడురోజులపాటు అమ్మవారికి పూజలు, భజనలు నిర్వహించి భక్తులు ఆరాదన ఉత్సవాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆఖరి రోజున నగర సంకీర్తన జరిపారు. సాయంత్రం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.


సాధు అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాజీనామా చేస్తున్న సహకార సంఘాధ్యక్షులు

తాళ్ళపూడి, జూన్ 13: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఇప్పటివరకూ నామినేటెడ్ పోస్టులలో కొనసాగుతున్న నేతలంతా స్వచ్ఛందంగా వారి పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. ప్రభుత్వం జీవోను విడుదల చేయగా ముఖ్యంగా కోఆపరేటివ్ సొసైటీలలో అధ్యక్షులుగా కొనసాగు తున్న వారు రాజీనామాలు చేశారు. గత 5 సంవత్సరాలుగా జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండానే తాత్కాలిక కమిటీలతో కాలయాపనచేశారు. తాడిపూడి, రాగోలపల్లి, మలకపల్లి సహకార సంఘాల కమిటీ సభ్యులు రాజీనామాలు చేశారు.


సీతంపేటలో పంపింగ్ స్కీమ్ ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, రైతులు

ప్రతి చేనుకు నీరు అందిస్తాం

● సీతంపేటలో పంపింగ్ స్కీమ్ ద్వారా ఆయకట్టుకు నీరు విడుదల

● రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

ఉండ్రాజవరం, నిడదవోలు, మే 13 : పతి చేనుకు నీరు.. ప్రతి ఒక్కరికీ పని అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. నిడదవోలు మండలంలో సీతంపేటలో పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు సాగునీరు విడుదలచేసే కార్యక్రమాన్ని గురువారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అన్నంపెట్టే రైతుల పొలాలకు సాగునీరు అందించే కార్యక్రమం మంత్రిగా పదవి చేపట్టిన తొలిసారిగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ చెప్పారు. రైతులకు అండగా ఉంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వంటి అపార అనుభవం గల నాయకులతో కలసి పనిచేస్తూ, నియోజవర్గ అభివృద్ధి, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజాసమస్యలు పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ప్రభుత్వం పక్షాన తగిన సహాయసహకారాలు అందించేందుకు అందుబాటులో ఉంటానని రాష్ట్ర మంత్రి దుర్గేష్ వివరించారు. మాజీ ఎమ్మెల్యే, నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ నియోజవర్గం అన్ని విధాలా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. తొలుత మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నియోజకవర్గానికి వచ్చిన మంత్రి దుర్గేష్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీగా వెళ్లి పలు దేవాలయాల్లో మంత్రి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఇరిగేషన్ ఈఈ ఎమ్. దక్షిణామూర్తి, డీఈ సత్యదేవ, జేఈ ఎస్.కిరణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ అమ్మవా రిని రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ గురువారం దర్శించుకున్నారు. మంత్రిగా పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా నిడదవోలు వచ్చిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావులు కలసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి దుర్గేష్‌కు పూలమాల వేసి, అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ నిర్వహకులు అందజేసారు. కార్యక్రమం లో ఆలయ ఫౌండర్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆల య ఈవో వి.హరిసూర్యప్రకాష్, జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.


అమ్మవారి ఫొటోను మంత్రి దుర్గేష్‌కు అందజేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే ముప్పిడి విజయోత్సవ సంబరాలు

కొవ్వూరు, జూన్ 13 : మండలంలోని దొమ్మేరు గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గురువారం దొమ్మేరు సావరం ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలు, నాయకులకు పంపిణీ చేశారు. ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలి సంతకం యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా 16, 347 ఉద్యోగాలకు సంబంధించి మెగా డీఎస్సీపై చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. అదే విధంగా రెండో సంతకం ప్రజలను భయాందోళనకు గురిచేసిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, సామాజిక పింఛన్లు రూ.3 నుంచి 4వేలకు పెంచుతూ మూడవ సంతకం, అన్నా క్యాంటీన్‌లు పునరుద్ధరణ చేస్తూ నాల్గవ సంతకం, స్కిల్ సెన్సస్ (విద్యార్థుల నైపుణ్యం పెంపొందించే) దస్త్రంపై సంతకాలు చేశారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో యలమర్తి శ్రీరాంప్రసాద్, గారపాటి రామకృష్ణ, కేవీకే రంగారావు, గంగుమళ్ల స్వామి, దొరబాబు, కలగల సుబ్బారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని దొమ్మేరు గ్రామంలో పాదయాత్రగా ప్రజలందరికీ అభివాదం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.


దొమ్మేరు గ్రామంలో విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

ఎమ్మెల్యే ముప్పిడికి ఉద్యోగుల అభినందన

కొవ్వూరు నియోజకవర్గ కూట మి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అనంతరం మండలంలోని సీఏలు తీసుకువచ్చిన కేక్ కట్ చేశారు. డ్వాక్రా సీఏలు, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, పోలవరం ఇరిగేషన్, సచివాలయ సిబ్బంది, ఇతరశాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యలో నెం.1కు వెళ్లబోతుంది

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్

చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన తరువాత మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీపై చేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ అన్నారు. గురువారం కొవ్వూరులో జవహర్ మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో విద్యావ్యవస్థను ప్రయోగశాల చేశారన్నారు. జీవో 117 పేరుతో బడుల విలీనం రాష్ట్రంలో ప్రాథ మిక విద్యను సర్వనాశనం చేశారన్నారు. 14వ మెగా డీఎస్సీతో దేశ, రాష్ట్ర భవిష్యత్ మారుతుందన్నారు. రాబో యో రోజులలో ఆంధ్రప్రదేశ్ విద్యలో నంబర్ 1 స్థానానికి వెళ్లబోతుందని జవహర్ తెలిపారు.

మెగా డీఎస్సీపై తొలి సంతకంతో హర్షం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేయడం హర్షణీయమని దళిత నాయకులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు తెలిపారు. మెగా డీఎస్సీతో 16347 టీచర్ పోస్టులు భర్తీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం గత 5 సంవత్సరాలుగా టీచర్‌పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగులను ఇబ్బం దులకు గురిచేసిందన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడిని కలిసిన సచివాలయ ఉద్యోగులు

తాళ్ళపూడి, జూన్ 13: తాళ్ళపూడి మండలంలోని సచివాలయ ఉద్యోగులు గురువారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాల్లో ఉన్నత పనితీరు కనబరుస్తూ ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన దగ్గర నుంచీ అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధనకు కృషిచేయాలని ఎమ్మెల్యేకు విన్నవించామని దీనిపై వారు సానుకూలంగా స్పందించారని సచివాలయ ఉద్యోగు లసంఘ అధ్యక్షుడు గణేష్ తెలిపారు

నల్లజర్లలో విజయోత్సవ ర్యాలీ

నల్లజర్ల, జూన్ 13: నల్లజర్లలో టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గురువారం జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ఇంటివద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామ పురవీధులు తిరిగి నల్లజర్ల కూడలికి చేరుకుంది. తీన్‌మార్ డప్పులతో, భారీ బాణ సంచా కాల్చా రు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుకు, మద్దిపాటి వెంకట్రాజుకు మహిళలు అడుగడుగున హారతులు అందించారు. కార్యక్రమంలో వల్లూరి సత్తిపండు, రావూరి వెంకటరమణ, గొట్టుముక్కల వేణు, నారాయణ,సవలం రామకృష్ణ, జాలపర్తి భార్గవ్ పాల్గొన్నారు.

కార్యకర్తల మొక్కు తీర్చిన మద్దిపాటి

సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా చంద్రబాబు, గోపాలపురం ఎమ్మెల్యేగా మద్దిపాటి వెంకట్రాజు విజయం సాధిస్తే వెంకట్రాజుతోపాటు వచ్చి పాలాభిషేకం చేస్తానని నల్లజర్లకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కండెపు వెంకటరత్నం సాయిబాబాకు మొక్కుకున్నారు. గురువారం మొక్కును చెల్లించేందుకు విజయవాడలో ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నల్లజర్ల చేరుకున్నారు. ఉదయం 6.30కు సాయిబాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబాకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, నల్లజర్ల మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న ఉద్యోగులు


నల్లజర్లలో సాయిబాబాకు పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


నల్లజర్లలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మద్దిపాటి, ముళ్లపూడి


తాళ్లపూడిలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


ముళ్లపూడి మణికంఠ చౌదరి (ఫైల్)

గోపాలపురం. జూన్ 13 : అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని జగన్నాధపురం గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివ రాల ప్రకారం మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి మణికంఠ చౌదరి (అయ్యప్ప)(31) అప్పుల కారణంగా గత కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గురువారం 3, 4 గంటల మధ్యలో కోడూరి వెంకటరమణకు చెందిన పొలంలో ఉన్న మామిడి చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరపల్లి సీఐ కె.బాలసురేష్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన అనంతరం కేసు నమోదు చేసుకు ని దర్యాప్తు చేస్తున్నట్లు వీఆర్వో పంచనామా అనంతరం మృతదే హాన్ని పోస్టుమార్టంకు పంపించినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఏడాది పాప ఉన్నట్లు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 62 మంది విద్యార్థుల ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 13 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో శిక్షణ పొందుతున్న చివరి ఏడాది విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. గురువారం జిల్లా పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రాంగణంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, వికాస సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎస్ఎస్‌డీసీ, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ తదితర ప్రముఖ కంపెనీలు శిక్షణ పొందుతున్న ప్రభుత్వ ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల విద్యార్థులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించి నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ కృష్ణన్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ వారి ఆదేశానుసారం, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థ రాజమహేంద్రవరంలో జరిగిన ఇంటర్వ్యూలకు 96 మంది విద్యార్థులు హాజరయ్యారని వారిలో 62 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు. మొత్తం 15 కంపెనీలు హాజరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కె.హరిచంద్రప్రసాద్, శిక్షణాధికారి బి.శివశంకర్, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


క్యాంపస్ ఉద్యోగాల నియమకాల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్

ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోండి

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్లకు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13: రాష్ట్ర్యవాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు గురువారం రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉద్యోగులు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 3600 ప్రభుత్వం మద్యం దుకాణాలలో సుమారు 14వేల మంది ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నామని వారు చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి తమ కుటుంబాలకు న్యాయంచేయాలని వారు కోరారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని గోరంట్ల వారికి చెప్పారు. కార్యక్రమంలో వై.రాజా, రవివర్మ, బిగిరి, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా లేని వారిపై మేమెందుకు దాడులు చేస్తాం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13: రాష్ట్రంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ఉన్నా వైసీపీ వాళ్లపై తామెందుకు దాడులు చేస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజానీకం ఇప్పటికే వైసీపీని తిరస్కరించిందన్నారు. రాష్ట్రంలో కేవలం 11 సీట్లకు వైసీపీని ప్రజలు పరిమితం చేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంవల్ల రాష్ట్రం 25 ఏళ్ల వెనక్కిపోయిందని రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికే ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ వెబ్‌సైట్ పునరుద్ధరణ

● లాంఛనంగా ప్రారంభించిన జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 13 : ఆర్యాపురం కోఆరేటివ్ అర్బన్ బ్యాంక్ కస్టమర్ల సౌకర్యార్థం పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను బ్యాంక్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ప్రారంభించారు. గురువారం బ్యాంక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కస్టమర్లకు అవసరమయ్యే సమాచారంను బ్యాంకు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కమిటీ సభ్యులైన జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్ ఎం.జగన్నాధరెడ్డి, డివిజనల్ సహకార అధికారి కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.కామరాజు, బ్యాంక్ సెక్రటరీ కె.స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వెబ్ సైట్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్ మీ
వై.స్క్రీన్2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
నిడదవోలు	
వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా